www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్   సంపుటి : 16   సంచిక : 123  గురువారం, సెప్టెంబర్ 17, 2026 , పేజీలు - 12   వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




## సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు

- దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుని రావాల్సిన అవసరం ఉందని అన్నారు. పన్ను నిబంధనలలో మార్పుల కోసం వ్యక్తిగత ప్రయోజనాల ఆధారంగా కాకుండా వ్యవస్థకు ఉపయోగపడే రీతిలో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారు. బెంగళూరులో ఇంటర్నేషనల్ ట్యాక్స్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ ఫౌండేష న్ 8వ అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కొన్ని నిబంధనల వల్ల కొందరు పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. అయినప్పటికీ.. ఈ నిబంధనలు పన్ను వ్యవస్థ సమర్థతను దెబ్బతీసేలా ఉంటే వాటిని తొలగించాలనే గళాన్ని వినిపించే వాళ్లు

మిగతా2లో...

# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

- యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం
- 22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించాం
- పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తాం
- పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తాం
- క్రమబద్ధీకరించిన, వేలం భూములకు విముక్తి
- ధరణి పేరిట గత ప్రభుత్వంలో దోపిడీ జరిగింది
- రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది
- బీఆర్ఎస్ భూములను ఇష్టారాజ్యంగా బదిలీ
- కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ చేస్తాం
- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతాం
- ఫాంహౌస్ భూములపై 30 రోజుల్లో నివేదిక
- శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



**హైదరాబాద్,సెప్టెంబర్ 16 :** 22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు

మిగతా2లో...

## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ




## 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పే
- హరీశ్‌రావు మామ భూములకు ఎలా జరిగింది?
- అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది హరీష్?
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్



**హైదరాబాద్,సెప్టెంబర్ 16 :** మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో

మిగతా2లో...

## ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

- ఈ ఏడాది అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యం
- ఉద్యాన రంగ అభివృద్ధికి రూ.1,000 కోట్లతో కార్యాచరణ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి






## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

- కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 :** యూపీఐ వినియో గదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)

మిగతా2లో...

## అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

- సీఎం కుటుంబానికి 308 ఎకరాల భూమి
- కాంగ్రెస్ అక్రమాలు బయటపెడతామనే మాపై సస్పెన్షన్
- భూభారతి, 22ఏపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్




**హైదరాబాద్,సెప్టెంబర్ 16 :** అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాలు భూమి ఉందన్నారు. వెల్దండ మండలం కొట్ర గ్రామంలోనే 175 ఎకరాలు, వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో 79 ఎకరాలు, ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఇతర భూమి 54

మిగతా2లో...



## పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

- కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం
- 51 లక్షల మంది లబ్ది పొందే చాన్స్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 :** దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.

మిగతా2లో...

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే...

- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ



# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు. ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ. 110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు. 2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చల విడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు. తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి 2010లో ఒడిశాలో మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో కాగ్? ధరణిపై తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్?ఎఫ్?ఎస్? దక్కించుకుందని వివరించారు. ఐఎల్?ఎఫ్ఎస్?, ధరణిని టెరాసిస్ అనే కంపెనీకి అమ్ముకుందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల చొప్పున ఉందని వివరించారు. రేవంత్‌రెడ్డి కుటుంబ భూముల వివరాలు అన్ని త్వరలో మరిన్ని బయటకి వస్తాయని చెప్పారు. ప్రజల సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే, డైవర్షన్ రాజకీయాలకు సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని చెప్పారు. ప్రభుత్వ అక్రమాలను బయటపెడతామనే సభలో లేకుండా చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినవన్నీ అర్ధసత్యాలు, అబద్ధాలని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటుకు టీ షర్ట్, స్టిక్కర్లు వేసుకుని వెళ్తే ఒప్పు, తాము టీ షర్టు వేసుకుని అసెంబ్లీకి వస్తే తప్పా? అని ప్రశ్నించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియమాలు వేరా? అని అడిగారు.**పథకం ప్రకారమే గెంటేశారు** వృద్ధులకు రూ.నాలుగు వేల పెన్షన్, మహిళలకు రూ.2500 ఇవ్వలేదనీ, విద్యార్థులకు భరోసా కార్డు ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు.ఈ వైఫల్యాలను టీ షర్ట్ మీద రాసుకొస్తే తమను సస్పెండ్ చేశారని అన్నారు. తాము కావాలని అసెంబ్లీ నుంచి బయటకు రాలేదనీ, పక్కా పథకం ప్రకారమే గెంటేశారని విమర్శించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికి, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే.. కనీసం మైక్ ఇవ్వాలని అడిగినందుకు సస్పెండ్ చేశారని అన్నారు. తాము సభలో ఉంటే కాంగ్రెస్ కుంభకోణాలు, రేవంత్‌రెడ్డి కుటుంబ అవినీతి బయటపడుతుందనే భయంతోనే మొత్తం సెషన్‌కి తమను సస్పెండ్ చేశారని వివరించారు. సస్పెన్షన్ ఎత్తేస్తే ఆధారాలతో సభకు వస్తామని తమ ఎమ్మెల్యేలు సవాల్ చేశారని గుర్తు చేశారు. సీపీఐ, బీజేపీలు అడిగినా సస్పెన్షన్ ఎత్తేసే దమ్ము సీఎంకు లేదన్నారు.

# ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 :** రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నా మని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం శాసనసభలో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ పథకాల కింద అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర పంటల వైపు రైతులను మళ్లించేందుకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగు విస్తరణకు అవసరమైన మొక్కలు, ఎరువులు, మల్చింగ్, షేడ్‌నెట్, ఫామ్‌పాండ్లు, శీతల గిడ్డంగులు, శాశ్వత పందిళ్లు, బిందు, తుంపర సేద్యం వంటి సదుపాయాలను నిబంధనల ప్రకారం 40 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీపై అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. 2026--27లో మొక్కలు, మల్చింగ్, షేడ్‌నెట్, కోత అనంతర నిర్వహణ సదుపాయాలు, శీతల గిడ్డంగులు, ఉద్యాన యాంత్రీకరణ, శాశ్వత పందిళ్ల కోసం రూ.150 కోట్లు, బిందు, తుంపర సేద్యం కోసం రూ.243 కోట్లు, ఆయిల్‌పామ్ అభివృద్ధికి రూ.261 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 88,282 మంది రైతులు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని మంత్రి తెలిపారు. చీవీజూ-ూౌ పథకం కింద 2021--22 నుంచి ఇప్పటివరకు 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి 1.37 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించామని చెప్పారు. 2026--27 సంవత్సరానికి 85 వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 29,053 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు మంత్రి వెల్లడించారు. సాంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు ఉన్న ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణలో భాగంగా ప్రభుత్వం ఈ పంటను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు మొక్కలు, డ్రిప్, మొదటి నాలుగేళ్లకు ఎరువులు, అంతర పంటల సాగు తదితరాలకు కలిపి ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఫామ్‌పాండ్లు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ చట్టం--1993 ప్రకారం ఫ్యాక్టరీ జోన్ కేటాయించిన ప్రతి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రతి నెలా ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర ఉందన్నారు. కనీస హామీ ధర (వీ-ూ) ప్రకటించాల్సింది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, అయినప్పటికీ రైతులకు మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని వీ-ూ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు.

# ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే...

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు.

కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

# సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు అవసరం అయ్యారని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, పన్నుల వసూళ్ల రంగానికి దీర్ఘకాలి కంగా ప్రయోజనం చేకూర్చే అంశాలపైనే ప్రతి ఒక్కరూ ప్రధానంగా దృష్టి సారించాలని నిర్మల సీతారామన్ చెప్పారు. పన్ను నిబంధనల సవరణలపై ప్రతిపాదనలు చేసేటప్పుడు పూర్తి సమాచారంతో కూడిన నివేదికలను సమర్పించాలని కోరారు. ఏదైనా నిబంధన వల్ల పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుంటే, దాని వల్ల ఎంతమంది ప్రభావితమవుతున్నారు, ఎంత సమయం, వ్యయం వృథా అవుతుందనే వివరాలను గణాంకాలతో సహా నిరూపించాలని కోరారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటో కూడా ప్రతిపాదించాలని, ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఆదాయంపై పడే ప్రభావాన్ని నిశితంగా అంచనా వేయాలని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. వీటి వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుంది, పన్ను పరిధి ఏ మేరకు ప్రభావితమవుతుంది, పన్నుల నిర్వహణపై ఎలాంటి ఫలితాలు ఉంటాయనే విషయాన్ని సమగ్రంగా విశ్లేషించడం ఎంతైనా అవసరమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పన్ను విధానాలను సరళీకరిస్తూనే, దేశ ఆర్థిక వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. నిబంధనల మార్పు ఒక వర్గానికి మాత్రమే కాకుండా, మొత్తం ఆర్థిక రంగానికి మేలు చేసేలా ఉన్నప్పుడే నిజమైన సంస్కరణలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. పన్నుల పరిధిని విస్తృతం చేస్తూనే, విధానపరమైన అడ్డంకులను తొలగించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

# యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

(మొదటి పేజీ తరువాయి)

విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50–55 కోట్లకు చేరిందని తెలిపారు.

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరపున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పూ లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.

# ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

# 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

# ఈజేహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో డీఎంహెచ్ఓ తనిఖీ

- ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు నిరంతర వైద్య సేవలు అందించాలి









**కూకట్‌పల్లి : సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)** మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కూకట్‌పల్లిలోని ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల ఆరోగ్య పథకం (ఇజీఎస్) వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్‌లో సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదవుతున్న రోగుల వివరాలు, అందిస్తున్న వైద్య సేవలు, రిఫరల్ కేసులను ఆయన పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, వాటి నమోదు ప్రక్రియ సక్రమంగా కొనసాగుతున్నాయా అనే అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వెల్‌నెస్ సెంటర్‌లో ప్రయోగశాల సేవలు, నమూనాల సేకరణకు అవసరమైన వాక్యూటైనర్లు అందుబాటులో ఉన్నాయా, వాటి వినియోగం, నమూనాల సేకరణ విధానాన్ని పరిశీలించారు. దంత వైద్య సేవల లభ్యతపై కూడా ఆరా తీశారు. రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు నిరంతరాయంగా అందేలా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

**ఈజేహెచ్ఎస్ సేవల ప్రక్రియపై సమీక్ష**

ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు ఆరోగ్య పథకం ద్వారా అందించే సేవల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ఈజేహెచ్ఎస్‌లోని ఓపీ, ఐపీ, అత్యవసర వైద్య సేవల ప్రక్రియను డా. కె. ఆనంద్ సమీక్షించారు. ఓపీ నమోదు, ఓపీ ప్రక్రియ, వైద్యుల సంప్రదింపులు, వైద్య పరీక్షలు, ఐపీ నమోదు, రోగి మూల్యాంకనం, ఆసుపత్రిలో చేర్పు, తుది నిర్ధారణ, వ్యాధి వర్గీకరణ, ముందస్తు అనుమతి, చికిత్స, డిశ్చార్జ్ ప్రక్రియలను పరిశీలించారు. అత్యవసర విభాగంలో రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ప్రక్రియలను కూడా తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో లబ్ధిదారులకు వేగవంతమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**సేవల్లో జాప్యం ఉండకూడదు**

ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణలో ఈజేహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని డా. కె. ఆనంద్ పేర్కొన్నారు. వైద్య సేవల నాణ్యత, రికార్డుల నిర్వహణ, మందుల లభ్యత, ఆన్‌లైన్ నమోదు, రిఫరల్ వ్యవస్థ, అత్యవసర వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు వైద్య సేవలు అందించడంలో ఎలాంటి జాప్యం, అంతరాయం ఉండకూడదని, ప్రతి దశలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సమర్థవంతమైన, నిరంతర ఆరోగ్య సేవలు అందేలా చూడాలని డా. కె. ఆనంద్ స్పష్టం చేశారు.

# కుమ్మరి బస్తీ దవాఖానాలో డీఎంహెచ్ఓ తనిఖీ

- వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వల పరిశీలన



**కూకట్‌పల్లి: సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)** మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ కూకట్‌పల్లి పరిధిలోని కుమ్మరి బస్తీ దవాఖానాను సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. దవాఖానాలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగుల నమోదు, మందుల లభ్యత, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. దవాఖానాకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని, ప్రజలకు అందుబాటులో ఉండేలా సిబ్బంది విధులు నిర్వహించాలని డా. కె. ఆనంద్ సూచించారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మందుల నిల్వలు, పంపిణీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. దవాఖానా పరిసరాల్లో పరిశుభ్రత, వైద్య పరికరాల నిర్వహణ, వైద్య వ్యర్థాల సరైన నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచే విధంగా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డా. కె. ఆనంద్ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, ప్రజలకు సులభంగా వైద్యం అందించడం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# హోంగార్డుపై దాడి.. నిందితుడికి 15 రోజుల జైలు

- రూ.3,050 జరిమానా విధించిన న్యాయస్థానం





**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)** విధుల్లో ఉన్న హోంగార్డుపై దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి న్యాయస్థానం 15 రోజుల జైలు శిక్షతో పాటు రూ.3,050 జరిమానా విధించింది. కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ స్కూల్ వద్ద సెప్టెంబర్ 15న హోంగార్డ్ ఎ+ 8481 ఎం. భాస్కర్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో జియగూడకు చెందిన పల్లపు శ్రీనివాస్ (40), రోడ్ డైవర్షన్‌ను అతిక్రమించి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. దీనిని హోంగార్డ్ ప్రశ్నించడంతో శ్రీనివాస్ దుర్భాషలాడుతూ భౌతిక దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఘటనపై కుల్సుంపురా పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ-పెట్టి కేసుగా ఎఫ్ఐఆర్ నెం. 4821/2026, తేదీ 15-09-2026న నమోదు చేశారు.

**నేరం రుజువు.. శిక్ష ఖరారు**

కేసుకు సంబంధించి సెప్టెంబర్ 16న నాంపల్లిలోని గాంధీ భవన్ మనోరంజన్ కాంప్లెక్స్‌లోని ×వ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి. సావిత్రి దేవి సమక్షంలో విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి 15 రోజుల జైలు శిక్ష, రూ.3,050 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్లు 292, 221, 115(2), సీపీ యాక్ట్ 70(బి) కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి ఆటంకం కలిగించడం, వారిపై దాడికి పాల్పడటం చట్టరీత్యా నేరమని, ఇలాంటి ఘటనలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని కుల్సుంపురా ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

# పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై కలెక్టర్ కన్నెర

- మెనూ అమలులో నిర్లక్ష్యంపై వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీకి ఆదేశాలు
- పనిచేయని ఆర్వో ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలి
- శుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవు
- వసతి గృహంలో సౌకర్యాలు ఆహార పదార్థాల నాణ్యతపై పరిశీలన



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 16(ప్రజా వీక్షణం):** పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై జిల్లా కలెక్టర్ అంకిత్ కన్నెర చేయడంతో పాటు మెనూ అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల తండాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ అక్కడ అపరిశుభ్రతతో పాటు చెత్త ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని ఎన్‌సీసీ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ ఎన్‌సీసీలో ఉన్న విద్యార్థుల సంఖ్య గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను ఉపాధ్యాయులు అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తదుపరి బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న వసతి తాగునీరు పారిశుద్ధ్యం భోజనం తదితర సౌకర్యాలను పరిశీలించారు. కిచెన్ షెడ్ స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి నిల్వ ఉంచిన సరుకులు ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కిచెన్‌లోని ఆర్వో వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్ అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టి ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న సౌకర్యాలు భోజనం తాగునీరు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన పౌష్టికాహారం అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం మెనూలో చికెన్ అందించాల్సి ఉన్నప్పటికీ విద్యార్థులకు వడ్డించిన భోజనంలో చికెన్ లేకపోవడాన్ని కలెక్టర్ గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించడంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేస్తూ సంబంధిత వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం ఆరోగ్యం విషయంలో అధికారులు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# విపత్తుల సమయంలో ఆపదమిత్రల పాత్ర కీలకం

- తక్షణ సహాయ చర్యలకు సిద్ధంగా ఉండాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 16(ప్రజా వీక్షణం):** విపత్తులు సంభవించిన సమయంలో తక్షణమే స్పందించి ప్రాణ ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆపదమిత్రలు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఆరవ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ఆధ్వర్యంలో యువ ఆపదమిత్రల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా 6వ బెటాలియన్‌కు చేరుకున్న కలెక్టర్‌కు బెటాలియన్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భౌగోళిక వాతావరణ పరిస్థితుల వైవిధ్యం కారణంగా దేశంలో వివిధ రకాల విపత్తులు సంభవించే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి వరదలు ఆకస్మిక వరదలు పట్టణ ప్రాంతాల్లో నీటి ముంపు అటవీ అగ్నిప్రమాదాలు పారిశ్రామిక ప్రమాదాలు తదితర విపత్తులు సంభవించే అవకాశం ఉన్నందున స్థానికంగా శిక్షణ పొందిన యువత అందుబాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు తక్షణ సహాయక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చన్నారు. విపత్తుల సమయంలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక అప్రమత్తత సమయస్ఫూర్తి పరిస్థితిని వేగంగా అంచనా వేసే సామర్థ్యం సరైన నిర్ణయం తీసుకునే నైపుణ్యం ఎంతో కీలకమని కలెక్టర్ తెలిపారు. శిక్షణలో భాగంగా ప్రామాణిక నిర్వహణ విధానాలు సమాచార ప్రసారం రెస్క్యూ పరికరాల వినియోగం బృంద సమన్వయం వంటి అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు. విపత్తు నిర్వహణ అనేది కేవలం తరగతి గదిలో నేర్చుకునే అంశం కాదని క్షేత్రస్థాయిలో నిరంతర సాధన మాక్ డ్రిల్స్ ద్వారా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సి ఉంటుందని అన్నారు. శిక్షణను పూర్తి ఏకాగ్రతతో తీసుకుని నేర్చుకున్న అంశాలను పదేపదే సాధన చేసి జిల్లాకు ఉపయోగపడేలా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అవసరమైన రెస్క్యూ పరికరాలు కిట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 6వ బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ మాట్లాడుతూ విపత్తులు సంభవించిన తొలి కొన్ని నిమిషాలు అత్యంత కీలకమన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు వేగంగా స్పందించి ప్రాథమిక సహాయక చర్యలు చేపట్టగలరన్నారు. శిక్షణలో బోట్ నిర్వహణ తాళ్ల సహాయంతో రక్షణ చర్యలు పైకి ఎక్కడం కిందికి దిగడం రాక్ క్లైంబింగ్ వివిధ రకాల ముడుల వినియోగం వంటి ప్రాక్టికల్ అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు. శిక్షణలో ఏదైనా అంశం స్పష్టంగా అర్థం కాకపోతే శిక్షకులను అడిగి తెలుసుకుని పదేపదే సాధన చేయడం ద్వారా పూర్తి నైపుణ్యం ఆత్మవిశ్వాసం సాధించాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఆపదమిత్రలకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా శిక్షణ కిట్లను అందజేశారు. విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో స్వచ్ఛందంగా పాల్గొనేందుకు ముందుకు వచ్చిన ఆపదమిత్రలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఆపదమిత్రకు మూడు సంవత్సరాల కాలానికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 416 మంది ఆపదమిత్రులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా తొలి విడతగా 120 మందికి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ శ్రీధర్ రాజా, అసిస్టెంట్ కమాండెంట్ మరియా దాస్, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, పోలీసు రెవెన్యూ విపత్తు నిర్వహణ శాఖల అధికారులు శిక్షకులు ఆపదమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ నంబర్ ప్లేట్లపై పోలీసుల కొరడా

- 5 క్రిమినల్ కేసులు నమోదు.. పలు వాహనాలు స్వాధీనం



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)** నకిలీ, ట్యాంపర్ చేసిన, అనుమతి లేని రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. నగరంలో నకిలీ నంబర్ ప్లేట్ల వినియోగంపై ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వాహనాల గుర్తింపును దాచేందుకు, ట్రాఫిక్ నిబంధనల నుంచి తప్పించుకునేందుకు నకిలీ నంబర్ ప్లేట్లను వినియోగించిన వారిపై గత వారంలో 5 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బండ్లగూడ, ఉస్మానియా యూనివర్సిటీ, మీర్‌పేట్, వనస్థలిపురం, అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కేసులు నమోదయ్యాయి. వీటిలో వనస్థలిపురం పోలీస్ స్టేషన్ మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ఉండగా, అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో ఉంది.

**హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్లే వినియోగించాలి**

ప్రభుత్వం నిర్దేశించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు (హెచ్ఎస్ఆర్‌పీ) మాత్రమే వాహనాలకు వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. నంబర్ ప్లేట్లలో సొంతంగా మార్పులు చేయడం, అంకెలు స్పష్టంగా కనిపించకుండా చేయడం, తాత్కాలిక స్టిక్కర్లు లేదా ఇతర మార్పులు చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. నకిలీ లేదా ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్లతో వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వాహనాల రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని వాహనదారులకు సూచించారు. ప్రజాభద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, చట్టబద్ధమైన వాహన రాకపోకలను నిర్ధారించేందుకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా బండారి రవీందర్

**పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలి: తోటకూర వజ్రేష్ యాదవ్**

**మేడ్చల్ జిల్లా : ప్రతినిధి శ్రవణ్ కుమార్ సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీలో బండారి రవీందర్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. మేడ్చల్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా బండారి రవీందర్‌ను నియమిస్తూ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, బండారి రవీందర్‌కు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు సాగాలని వజ్రేష్ యాదవ్ ఆకాంక్షించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని అన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బండారి రవీందర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన తోటకూర వజ్రేష్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కార్యకర్తలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ, పార్టీ అభివృద్ధికికృషిచేస్తానని రవీందర్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ స్థలాలను పరిరక్షించండి

**-ఎం సీపీఐ నాయకులు ముడి మార్టిన్..**

**మేడిపల్లి : ప్రతినిధి శ్రవణ్ కుమార్ సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**



ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ, మేడిపల్లి మండల కార్యదర్శి ముడి మార్టిన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల రెవిన్యూ కార్యాలయంలో, తహశీల్దార్ ని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక మేడిపల్లి మండల ప్రాంతంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యదేచ్ఛగా నిర్మాణాలు జరుగుతుంటే, అక్రమ నిర్మాణాలపై పలుమార్లు పిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పార్లట్టించుకోలేదని అన్నారు. కాలయాపన చేసుకుంటూ అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్న కింది స్థాయి ఉద్యోగులపై విచారణ జరిపించి, ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ప్రజాప్రయోజనాల నిమిత్తమై భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

# సెంట్రల్ లైట్లు వెలిగించాలి

**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**




ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ నుంచి భారత్‌నగర్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులను కోరారు. లైటింగ్ పోల్స్ ఏర్పాటు చేసి దాదాపు సంవత్సరం గడుస్తున్నా ఇప్పటివరకు లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇందిరమ్మ కాలనీ, పీకే రామయ్య కాలనీ, మేర కాలనీ, అన్నపూర్ణ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు చీకటి కారణంగా అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో, త్వరలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు కూడా జరగనున్నందున మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి మేడిపల్లి రోడ్డు నుంచి భారత్‌నగర్ వరకు ఉన్న సెంట్రల్ లైట్లను వెలిగించాలని కోరారు. ఈ మేరకు స్థానిక ఎన్టీపీసీ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్‌తో పాటు రెడపాక లక్ష్మణ్, టి. సత్యనారాయణ, బి. అర్జున్, జి. మహేశ్వరరావు, ఏ. రాజేం దర్‌రెడ్డి, ఎం. మల్లేష్, జి. లక్ష్మణ్ తదితరులు రామగుండం మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

# రైతులకు బోనస్ కోసం వివరాల నమోదు

**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**

రామగుండం: డీలర్ వద్ద కొనుగోలు చేయకుండా సొంతంగా సన్నవరి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం అందించే బోనస్ కోసం వివరాల నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు రామగుండం మండల వ్యవసాయ అధికారి ప్రకాష్ తెలిపారు. గురువారం (సెప్టెంబర్ 17) ఉదయం 10 గంటలకు మేడిపెల్లి రైతు వేదికలో రైతుల వివరాలు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని సన్నవరి సాగు చేసిన రైతులు మేడిపెల్లి రైతు వేదికకు హాజరై తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్ కార్డు, పట్టా పాస్‌పుస్తకం జిరాక్స్ ప్రతులతో పాటు దరఖాస్తు ఫారం తీసుకురావాలని తెలిపారు. సెప్టెంబర్ 17నే దరఖాస్తుల నమోదుకు చివరి తేదీ అని, అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి ప్రకాష్ కోరారు.

# నాగోల్ హత్య కేసును ఛేదించిన ఎస్ఓటీ, నాగోల్ పోలీసులు

- 9 మంది నిందితుల అరెస్ట్.. మరో నలుగురు పరారీ
- హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, కారు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం






**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**

నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మహ్మద్ నయీమ్ హత్య కేసును ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్, నాగోల్ పోలీసులు ఛేదించారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసులో 9 మంది నిందితులను అరెస్ట్ చేశారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ తెలిపారు.

**పాత పరిచయాలు.. ఇటీవల విభేదాలు**

మీడియా సమావేశంలో కమిషనర్ సుమతి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 14న నాగోల్‌లోని బండ్లగూడ సుప్రీమ్ వైన్స్ వద్ద మహ్మద్ నయీమ్‌పై కొందరు వ్యక్తులు ప్రాణాంతక ఆయుధాలతో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. మృతుడు నయీమ్ ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా ఉన్నట్లు పేర్కొన్నారు. నయీమ్‌తో పాటు కనకం ఉమా మహేష్, సయ్యద్ రబ్బానీ, ఓట్ల దినకర్ తదితరులకు గతంలో పరిచయాలు ఉన్నాయని దర్యాప్తులో గుర్తించినట్లు కమిషనర్ తెలిపారు. వీరికి ఉప్పల్, వనస్థలిపురం, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలో క్రిమినల్ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ఇటీవల ఏర్పడిన విభేదాలు, బెదిరింపుల నేపథ్యంలో నయీమ్‌ను హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. సయ్యద్ రబ్బానీ తన మాజీ జైలు సహచరుడు రసుమల్ల సాకేత్‌ను సంప్రదించగా, అతడి ద్వారా వొల్లిపొల్ల మహేష్, అతని సహచరులు ఈ వ్యవహారంలో చేరినట్లు పోలీసులు గుర్తించారని చెప్పారు.

**ఖమ్మంలో సమావేశం.. హైదరాబాద్‌లో హత్య**



సెప్టెంబర్ 13న నిందితులు ఖమ్మంలో సమావేశమై హత్యకు సంబంధించిన ప్రణాళికపై చర్చించినట్లు దర్యాప్తులో తేలిందని కమిషనర్ తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 14న హైదరాబాద్‌కు చేరుకుని నాగోల్ బండ్లగూడలో నయీమ్‌పై దాడి చేసి హత్య చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై నాగోల్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 577/2026, బీఎన్ఎస్ సెక్షన్ 103(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

**9 మంది అరెస్ట్**

ఈ కేసులో సయ్యద్ రబ్బానీ, ఓట్ల దినకర్, వొల్లిపొల్ల మహేష్, రసుమల్ల సాకేత్, అలకుంట వెంకట్, కొడిగంటి రాఘవేందర్ అలియాస్ రఘు, వల్లపుదాసు చరణ్ గౌడ్, మహ్మద్ బద్రుల్లా హుస్సేన్ అలియాస్ బద్రి, తొడేటి వెంకటేష్‌లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో కొందరికి గతంలో కూడా క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

**ఆయుధాలు, వాహనాలు స్వాధీనం**

నిందితుల నుంచి హత్యకు ఉపయోగించినట్లు పేర్కొన్న వేట కొడవలి, ఇనుప కడాయి, టయోటా కారు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాల్లో గ్లామర్, సుజుకీ యాక్సెస్ ఉన్నాయి.

**మరో నలుగురి కోసం గాలింపు**

ఈ కేసులో కనకం ఉమా మహేష్, మహ్మద్ ఇస్మాయిల్ జబీ, భోలే, ఖమ్మంకు చెందిన కార్తీక్ పరారీలో ఉన్నారని కమిషనర్ సుమతి తెలిపారు. వీరి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారని, త్వరలోనే వారిని పట్టుకుంటామని వెల్లడించారు. కేసు దర్యాప్తు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ బి. అనురాధ, ఐపీఎస్, ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్ మార్గదర్శకత్వంలో కొనసాగింది. ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ అదనపు డీసీపీ ఎం.డి. షకీర్ హుస్సేన్, ఎల్‌బీనగర్ ఏసీపీ బి. రవీందర్ రెడ్డి, నాగోల్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ, ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ ఇన్‌స్పెక్టర్ కె. ప్రతాప్ రెడ్డి తదితరులు దర్యాప్తులో పాల్గొన్నారు.

# ఫతేనగర్ లో బతుకమ్మ దారిలో విచ్చలవిడిగా చెత్త.. ఆడపడుచులకు తప్పని తీవ్ర ఇబ్బందులు

- పండుగ సాగే మార్గంలోనే చెత్తకుప్పలు, పాడైపోయిన సోఫాలు.. మూత్ర విసర్జనతో అపరిశుభ్ర వాతావరణం
- వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్...






**బాలానగర్ సెప్టెంబర్ 17 ( పీపుల్స్ న్యూస్)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు జరుగుతున్న వేళ.. బతుకమ్మలు నిర్వహించే దారుల్లో అపరిశుభ్రత నెలకొనడం పట్ల స్థానికులు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయిన్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఫతేనగర్ డివిజన్, పైప్‌లైన్ సమీపంలోని బతుకమ్మ కుంటకు వెళ్లే దారిలో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం, పాడైపోయిన సోఫా సెట్లు, పనికిరాని వస్తువులు, ఇతర వ్యర్థాలను పడేయడంతో మార్గం మొత్తం అపరిశుభ్రంగా మారిందని స్థానికులు వాపోతున్నారు.

**-- బతుకమ్మ దారిలోనే చెత్తకుప్పలు............**

తెలంగాణ ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగలో మహిళలు పూలతో బతుకమ్మలను పేర్చి, వాటిని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులు, కుంటల వద్ద నిమజ్జనం చేయడం ఆనవాయితీ. అలాంటి పవిత్రమైన కార్యక్రమం జరిగే బతుకమ్మ కుంట మార్గంలోనే చెత్తను ఇష్టారాజ్యంగా పడేయడం సంస్కృతిని, పండుగ పవిత్రతను అవమానపరిచే చర్యగా స్థానికులు అభివర్ణిస్తున్నారు. చెత్తతో పాటు పాడైపోయిన ఫర్నిచర్, సోఫాలు, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో నడిచేందుకు కూడా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఈ మార్గంలో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

**-- మహిళలకు మరింత ఇబ్బందికర పరిస్థితి...........**

చెత్త పేరుకుపోయిన ప్రాంతంలో కొందరు బహిరంగంగా మూత్ర విసర్జన చేయడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన, అపరిశుభ్రత కారణంగా మహిళలు ఆ మార్గంలో నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బతుకమ్మ పండుగలో మహిళలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించే ప్రాంతంలో కనీస పారిశుధ్య చర్యలు లేకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

**-- అధికారులు వెంటనే స్పందించాలి........**

పండుగ రోజుల్లో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున సంబంధిత మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి బతుకమ్మ కుంటకు వెళ్లే మార్గాన్ని పూర్తిగా శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు పాడైపోయిన ఫర్నిచర్, ఇతర వ్యర్థాలను కూడా అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. పండుగ పూర్తయ్యే వరకు ఈ ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి నిరంతరం శుభ్రతను పర్యవేక్షించాలని కోరుతున్నారు. అవసరమైన చోట చెత్త డబ్బాలను ఏర్పాటు చేసి, వ్యర్థాలను రోడ్లపై పడేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.

**-- ప్రధాన రోడ్డు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.........**

చెత్త వేస్తున్న ప్రాంతాల్లో 'ఇక్కడ చెత్త వేయరాదు', 'బతుకమ్మ దారి -- పరిశుభ్రంగా ఉంచండి' వంటి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. బహిరంగ మూత్ర విసర్జనకు అడ్డుకట్ట వేసేందుకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా యువత, ఉత్సవ కమిటీల భాగస్వామ్యం అవసరం బతుకమ్మ ఉత్సవ కమిటీలు, స్థానిక యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాలు కూడా పారిశుధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని స్థానికులు కోరుతున్నారు. పండుగ రోజుల్లో బతుకమ్మ దారిలో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించడం, సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచవచ్చని పేర్కొన్నారు.

**"బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక.....**

బతుకమ్మలు వెళ్లే దారే చెత్తకుప్పగా మారితే అది మనందరికీ అవమానం. అధికారులు తక్షణమే స్పందించి మార్గాన్ని శుభ్రం చేసి, పండుగ రోజులలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలి" అని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.
మన సంస్కృతిని గౌరవించడం ఎంత ముఖ్యమో.. పండుగ జరిగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కూడా అంతే ముఖ్యమని స్థానికులు పేర్కొంటున్నారు

# వినాయక నగర్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

● వినాయక మండపాన్ని సందర్శించిన బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, సీఐ ప్రశాంత్



**బాలానగర్ సెప్టెంబర్ 17 ( పీపుల్స్ న్యూస్)**
బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బాలానగర్‌లోని వినాయక నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ నరేష్ రెడ్డి, స్టేషన్ హౌస్ అధికారి ప్రశాంత్ ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక మండపానికి చేరుకున్న పోలీసు అధికారులకు అసోసియేషన్ కమిటీ సభ్యులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అధికారులు విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండపంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి, ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు సహకరించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం వినాయక నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, స్టేషన్ హౌస్ అధికారి ప్రశాంత్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి వినాయక మండపానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నందుకు కమిటీ సభ్యులు పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, పోలీసు అధికారులు మండపాన్ని సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ప్రజలు, పోలీసులు పరస్పర సహకారంతో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినాయక నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి.. ఆచూకీ కోసం పోలీసుల విజ్ఞప్తి

**భరత్‌నగర్‌లో అపస్మారక స్థితిలో లభ్యం.. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి**



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**
భరత్‌నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సనత్‌నగర్ పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 8న ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో హైదరాబాద్ టీ హౌస్, భరత్‌నగర్ వెనుక వైపు రోడ్డుపక్కన ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు డయల్ 100కు సమాచారం అందింది. సమాచారం అందుకున్న సనత్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి చేర్పించారు. అయితే సెప్టెంబర్ 15న సాయంత్రం 6.40 గంటల సమయంలో చికిత్స పొందుతూ సదరు వ్యక్తి మృతి చెందినట్లు డ్యూటీ వైద్యులు నిర్ధారించారు. మృతుడి వివరాలు తెలియరావాల్సి ఉంది. ఫోటోలో ఉన్న వ్యక్తిని ఎవరైనా గుర్తించినా, అతని ఆచూకీ లేదా కుటుంబ సభ్యుల వివరాలు తెలిసినా సనత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్లు:వెంకటేశం, ఎస్ఐపీ: **8712581139 8712680289**

# సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

● విమోచన చరిత్రను భావితరాలకు అందించేందుకు 'సప్త సంకల్పాలు' అమలు చేయాలి

● వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, కంచి మహేందర్




**బాలానగర్ సెప్టెంబర్ 17 ( పీపుల్స్ న్యూస్)**
సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించి, తెలంగాణ ప్రజల పోరాట చరిత్రను భావితరాలకు అందించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, కంచి మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యంలో ఫతేనగర్‌లో తహసీల్దార్/మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ.. తెలంగాణ విమోచన పోరాటంలో పాల్గొన్న యోధులు, అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి తరానికి బాధ్యత అన్నారు. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక ప్రాధా న్యత ఉందని, ఆ చారిత్రక నేపథ్యాన్ని ప్రజలకు తెలియజేసే విధంగా అధికారికంగా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**'-- తెలంగాణ సప్త సంకల్పాలు' అమలు చేయాలి.....**
తెలంగాణ విమోచన చరిత్రను కేవలం ఒక రోజు కార్యక్రమానికే పరిమితం చేయకుండా శాశ్వతంగా పరిరక్షించేందుకు బీజేపీ ప్రతిపాదించిన లిలి'తెలంగాణ సప్త సంకల్పాలు'ను అమలు చేయాలని వారు కోరారు. ఇందులో భాగంగా సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయడంతో పాటు హైదరాబాద్--తెలంగాణ విమోచన మ్యూజియాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రతి జిల్లాలో స్మృతి కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తెలంగాణ విమోచన చరిత్రకు సంబంధించిన అంశాలను పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలని కోరారు. చారిత్రక ప్రదేశాల్లో స్మారక స్తూపాలు ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ విమోచనకు సంబంధించిన ముఖ్యమైన ప్రదేశాలను అనుసంధానిస్తూ విమోచన పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

**-- అమరవీరుల త్యాగాలను భావితరాలకు చాటాలి......**
తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరుల త్యాగాలు, ఉద్యమ నేపథ్యం, చారిత్రక సంఘటనలను భవిష్యత్ తరాలు తెలుసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు అన్నారు. చరిత్రను పరిరక్షించడంతో పాటు, అమరవీరుల స్మృతులను గౌరవించే విధంగా స్మారక కేంద్రాలు, మ్యూజియంలు ఏర్పాటు చేయడం అవసరమని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించడం ద్వారా చరిత్రను గౌరవించడంతో పాటు, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేయవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్, బాలానగర్, మూసాపేట, అల్లాపూర్ ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వినతిపత్రం సమర్పించారు.

# వినాయక నిమజ్జనంలో విషాదం

**ప్రమాదవశాత్తూ చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి**

**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**
వినాయక నిమజ్జనం సందర్భంగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు వెళ్లిన ఆరుగురు విద్యార్థులు ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందినట్లు సమాచారం. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. జిన్నారం మండలం శివనగర్‌లోని శిరీష మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన విద్యార్థులు బుధవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో పెద్ద కంజర్ల గ్రామ శివారులోని నేరేడుకుంట చెరువు వద్దకు వినాయక విగ్రహ నిమజ్జనం కోసం వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ ఆరుగురు విద్యార్థులు చెరువులో పడిపోయారు.
సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి విద్యార్థులను బయటకు తీసుకొచ్చారు. అనంతరం పటాన్‌చెరు పట్టణంలోని ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సీపీఆర్ చేసి చికిత్స అందించినప్పటికీ ఆరుగురు మృతి చెందినట్లు సమాచారం.
మృతుల వివరాలు
- సిద్ధార్థ్ -- 10వ తరగతి
- నరసింహరాజు -- బీటెక్ ద్వితీయ సంవత్సరం
- సుమంత్‌రెడ్డి -- పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం
- గణేష్ -- పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం
- ఉదయ్‌కిరణ్ -- పాలిటెక్నిక్ తృతీయ సంవత్సరం
- శ్యామ్‌కుమార్ -- పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరం

ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను ఆసుపత్రిలో ఉంచి తదుపరి చర్యలు చేపడుతున్నారు. ఘటనతో విద్యార్థుల కుటుంబాల్లో విషాదం నెలకొంది.

# అనుమతులు లేకుండా వైద్యం.. నకిలీ వైద్యుడు అరెస్ట్

●బాలాజీనగర్‌లో శ్రీనివాస క్లినిక్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహణ

●వైద్య పరికరాలు, మందులు, ప్రిస్క్రిప్షన్ స్వాధీనం



**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**
అనుమతులు లేకుండా వైద్యుడిగా వ్యవహరిస్తూ క్లినిక్ నిర్వహిస్తున్న వ్యక్తిని ఎస్ఓటీ మల్కాజిగిరి జోన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బాలాజీనగర్‌లోని శ్రీనివాస క్లినిక్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పై ఎస్ఓటీ మల్కాజిగిరి జోన్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా వంగ చక్రపాణి (65) అనే వ్యక్తి సరైన అనుమతులు లేకుండా వైద్యుడిగా సేవలు అందిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. క్లినిక్‌లో ఉన్న వైద్య పరికరాలు, మందులు, ప్రిస్క్రిప్షన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి చట్టపరమైన చర్యల కోసం జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ అధికారులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు విఘాతం కలిగించే విధంగా అనధికారికంగా వైద్యం చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

● వినాయకుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు.. భక్తులకు అన్నదానం



**బాలానగర్ సెప్టెంబర్ 17 ( పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బాలానగర్ డివిజన్ పరిధిలోని వినాయకనగర్ కాలనీలో భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. వినాయకనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన శ్రీ విఘ్నేశ్వర స్వామివారికి ఆవుల రవీందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో హారతి సమర్పించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా అన్నప్రసాదం అందజేశారు. ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని అన్నారు. ఈ సందర్భంగా ఆవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో ఆనందం, శాంతి, సుఖసంతోషాలు, సిరిసంపదలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించి, ప్రజలకు శుభాలను ప్రసాదించాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కాలనీ సంక్షేమం, ప్రజల ఐక్యత, సామాజిక సేవా కార్యక్రమాలకు వినాయకనగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, సమాజహితం కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రత్యేక పూజలు, హారతులతో పాటు అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వినాయకనగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# అక్రమంగా తరలిస్తున్న పశువులు,వాహనం స్వాధీనం




**మందమర్రి సెప్టెంబర్ 16**

మందమర్రి ప్రాంతంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.ఈ సందర్భంగా 12 పశువులతో పాటు మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు,టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో బుధవారం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ లచ్చున్న,సిబ్బంది మందమర్రి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు.

ఈ క్రమంలో ఆసిఫాబాద్ జిల్లా నుంచి జగిత్యాల జిల్లాలోని రాజారాంపల్లె మార్కెట్‌కు పశువులను అక్రమంగా తరలిస్తున్న మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వాహనంలో 8 ఆవులు,4 దూడలు, మొత్తం 12 పశువులు ఉన్నట్లు గుర్తించారు.దీంతో పశువులతో పాటు మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు వాహనాన్ని ఆపిన సమయంలో డ్రైవర్ వారిని గమనించి వాహనం నుంచి దిగి అక్కడి నుంచి పరారయ్యాడు. పరారీలో ఉన్న డ్రైవర్‌ను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

స్వాధీనం చేసుకున్న 12 పశువులు, మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మందమర్రి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.

# ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డు పంపిణి

**రఘునాథపాలెం సెప్టెంబర్ 15**



ఖమ్మంజిల్లా రఘునాథపాలెం ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ చిమ్మపూడి గ్రామ పంచాయతి ఆఫీస్ లో గ్రామ ప్రజలకు గ్రామ సర్పంచ్ కోటేరునర్సిరెడ్డి ఇస్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కోటేరునర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా అందజేసేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా లబ్ధిదారుల వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేసి రేషన్ సరుకులు పంపిణీలో మరింత పారదర్శకత తీసుకురావడానికి అవకాశం ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ ఉదయ్ కుమార్ వార్డ్ మెంబర్ గుండ్ల ముత్తయ్య చిమ్మపూడి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## - మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య





**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెప్టెంబర్ 16**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న సివిల్ పనులను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య బుధవారం పరిశీలించారు. పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాల సౌకర్యాలు, విద్యాభ్యాసంపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల రికార్డులు, ఆపార్ నమోదు, బేస్‌లైన్ పరీక్షల నివేదికలను పరిశీలించారు.అనంతరం వేమనపల్లి మండలం కల్మల్‌పేటలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించి, నోటీసులు అందుకున్న ప్రజల అభ్యంతరాలను తెలుసుకున్నారు. సంబంధిత రికార్డులను నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు. మండల ప్రజా పరిషత్ సమావేశంలో అభివృద్ధి పనులు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నీటి సంరక్షణ, పారిశుధ్యం, తడి--పొడి చెత్త సేకరణ, వీధి దీపాలు, ప్లాస్టిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.

# ఓజోన్ పొర పరిరక్షణకు సమష్టి కృషి చేయాలి

**ఎన్టీపీసీ రామగుండంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం**












**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**

ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ఆధ్వర్యంలో బుధవారం పలు పర్యావరణ పరిరక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీపీసీ (ఆర్అండ్‌టీ) ఈఎంజీ విభాగం, తెలంగాణ ఎస్‌టీపీపీ సీహెచ్‌పీ విభాగం సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఏడాది “గ్లోబల్ యాక్షన్ ఫర్ ఏ కూలర్ ప్లానెట్” అనే థీమ్‌కు అనుగుణంగా ఓజోన్ పొర పరిరక్షణ, పర్యావరణ హిత జీవన విధానంపై అవగాహన కల్పించారు.తెలంగాణ కోల్ భవన్ సమీపంలోని సీహెచ్‌పీ ప్రాంతంలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమాన్ని ఎన్టీపీసీ ఈడీ (ఆర్అండ్‌టీ) చందన్ కుమార్ సమంత ప్రారంభించారు. తెలంగాణ సీఎంవో (ఓఅండ్ఎం) సీజీఎం ముకుల్ రాయ్, రామగుండం జీఎం (ఓఅండ్ఎం) మనిష్ అగర్వాల్, ఇతర సీనియర్ అధికారులు, ఎన్టీపీసీ (ఆర్అండ్‌టీ) అధికారులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీహెచ్‌పీ ప్రాంతంలో ఫలవృక్ష మొక్కలను నాటారు.అనంతరం ఈఎంజీ విభాగం ఆధ్వర్యంలో ఓజోన్ పొర ప్రాధాన్యం, ప్రపంచ ఓజోన్ దినోత్సవం విశిష్టత, పర్యావరణ పరిరక్షణలో సమష్టి కృషి అవసరంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటిన మొక్కలను సంరక్షించి, వాటి పెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని చందన్ కుమార్ సమంత సూచించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా సీహెచ్‌పీ వర్క్‌షాప్‌లో తయారు చేసిన ప్లాస్టిక్ బాటిల్ సేకరణ బిన్‌ను చందన్ కుమార్ సమంత ప్రారంభించారు. దీనిని ఎన్టీపీసీ రామగుండం టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసి ప్లాస్టిక్ బాటిళ్లను క్రమబద్ధంగా సేకరించేందుకు వినియోగించనున్నారు.అలాగే ఎన్టీపీసీ రామగుండంలోని జెడ్పీహెచ్ పాఠశాల, టిటీఎస్ విద్యార్థులకు ఈఎంజీ విభాగం ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల భాగస్వామ్యంతో మొక్కలు నాటారు. ఓజోన్ పొర పరిరక్షణ, పర్యావరణ సంరక్షణపై డీఎస్ రావత్, ఏజీఎం (టీఎస్), ఎన్టీపీసీ (ఆర్అండ్‌టీ) విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.విద్యార్థులు లైఫ్ (ాఅఖీజు--ాఅటవర్ఎశ్రీవ టశీతీ జుఅజఅతీశీఅఎవత్) విధానాలను అలవర్చుకుని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కార్యక్రమంలో సూచించారు. ఉద్యోగులు, విద్యార్థులు, సమాజంలో పర్యావరణ చైతన్యం పెంపొందించడంతో పాటు స్థిరమైన పర్యావరణహిత పద్ధతులను ప్రోత్సహించేందుకు ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ చేపడుతున్న కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

# నిమజ్జన ఏర్పాట్లపై పోలీస్--మున్సిపల్ శాఖల సమన్వయం

- క్షేత్రస్థాయిలో నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన సైబరాబాద్ సీపీ రమేష్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ సృజన
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: సీపీ రమేష్











**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**

వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ఏర్పాట్లపై బుధవారం పోలీస్, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన సీపీ.. అనంతరం కమిషనరేట్ పరిధిలోని పలు నిమజ్జన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐడీపీఎల్, సూరారం తదితర చెరువుల వద్ద నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లను సీపీ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్లు, విద్యుత్ దీపాలు, గజ ఈతగాళ్ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.నిమజ్జనం సందర్భంగా భారీగా తరలివచ్చే భక్తులు, వాహనాల రాకపోకలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీస్ సిబ్బంది, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ జి. సృజన, మున్సిపల్ జోనల్ కమిషనర్లు, జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీ కోటి రెడ్డి, డీసీపీ రీతిరాజ్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిణి రెడ్డి, ఎస్బీ డీసీపీ సువేంద్ర, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీస్ సిబ్బందితో పాటు విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ, దేవాదాయ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 97 ను రద్దు చేయాలి

## ఎస్‌ఎఫ్‌ఐ మధిర మండల కమిటీ

**మధిర సెప్టెంబర్ 16**




పాలిటెక్నిక్ విద్యార్థులకు తీవ్రమైన నష్టం కలిగించే జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాల ఖాజీపురం నుండి ఆదుకోరు రింగ్ రోడ్డు వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్ అనిల్ తేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి చేతులు దులిపేసుకునే కుట్ర చేస్తుందని అన్నారు. శక్తి పథకం తీసుకువచ్చి అందులో పాలిటెక్నిక్ విద్యను కలిపి వేసి ప్రైవేట్ కంపెనీలకు కావాల్సిన వర్కర్స్ ను తయారు చేసుకునే విధంగా పథకాన్ని మార్చి విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం చేస్తుందని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా మరింత తీవ్రమైన ఉద్యమాలు నిర్వహిస్తారని హెచ్చరించారు. విద్యార్థులు ఎన్నో ఆశలతో పాలిటెక్నిక్ విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఉన్నత చదువులను అభ్యసించేందుకు ఉన్న అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం తమకు ఉన్న అధికారంతో కాలరాయటం దుర్మార్గమైన చర్య అని అన్నారు ఈ చర్యలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు పాలిటెక్నిక్ విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న ఆందోళనను ప్రతి ఒక్కరూ మద్దతు తెలియజేయాలని కోరారు జీవో నెంబర్ 97ను వెనుక తీసుకునే అంతవరకు దశల వారి ఆందోళన కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# లాలాగూడలో కార్తీక్ హత్య కేసు ఛేదింపు

- పాత కక్షల నేపథ్యంలో హత్య.. ఐదుగురు నిందితుల అరెస్ట్
- కత్తి, వెదురు కర్రలు, డిజిటల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీ స్వాధీనం



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**
లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన బూరుగు కార్తీక్ హత్య కేసును పోలీసులు త్వరితగతిన ఛేదించారు. పాత కక్షలు, వ్యక్తిగత విభేదాల నేపథ్యంలో జరిగిన ఈ హత్యకు సంబంధించి ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 13న రాత్రి సుమారు 8.50 గంటల సమయంలో తుకారం గేట్, సాయినగర్‌లోని నాగేష్ ఇంటి ముందు ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద కార్తీక్‌పై దాడి జరిగింది. గతంలో రాజమండ్రి కార్తీక్, భాను శ్రీ ప్రేమ వివాహానికి కార్తీక్ సహకరించాడన్న కారణంతో నిందితుల కుటుంబం అతనిపై కక్ష పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు.సెప్టెంబర్ 13న సాయంత్రం ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగగా.. అదే రోజు రాత్రి కార్తీక్ తన స్నేహితులతో కలిసి తిరిగి ఆ ప్రాంతానికి వచ్చిన సమయంలో నిందితులు దాడికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. సీసీటీవీ ఫుటేజీ, ప్రత్యక్ష సాక్షుల సమాచారంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు హత్యకు సంబంధించి వివరాలను సేకరించారు.పోలీసుల కథనం ప్రకారం.. ఏ-2 గద్ది ప్రవీణ్ కుమార్ ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి ఏ-1 గద్ది మదన్ కుమార్‌కు అందజేశాడు. అనంతరం మదన్ కుమార్ కార్తీక్‌పై కత్తితో దాడి చేయగా.. మిగతా నిందితులు వెదురు కర్రలతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు.మృతుడి భార్య బూరుగు అనుష ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఏ-1 గద్ది మదన్ కుమార్, ఏ-2 గద్ది ప్రవీణ్ కుమార్, ఏ-3 గద్ది సాయి కుమార్, ఏ-4 గద్ది నాగేష్ ఏ నాగేశ్వర్ రావు, ఏ-5 గద్ది నర్సింగ్ రావులను అరెస్ట్ చేశారు.సంఘటనకు సంబంధించి రక్తపు మరకలున్న కత్తి, వెదురు కర్ర, డిజిటల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులపై హెచ్చరిక**
హత్య ఘటన నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, ఐపీఎస్ హెచ్చరించారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రతీకార దాడులకు పాల్పడినా, అల్లర్లు సృష్టించినా, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని తెలిపారు.కేసును ఛేదించడంలో కృషి చేసిన లాలాగూడ ఎస్‌హెచ్‌ఓ బి. రవి కిరణ్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందిని చిలకలగూడ ఏసీపీ కే. శశాంక్ రెడ్డి పర్యవేక్షణలో సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ జె. నర్సయ్య అభినందించారు.

# సెప్టెంబర్ 17న ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

- నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో వేడుకలు



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, సెప్టెంబర్ 16:** మంచిర్యాల జిల్లాలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీన ఉదయం 10 గంటలకు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ప్రజలకు ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో నిర్వహించే ప్రజాపాలన దినోత్సవానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ వేడుకల్లో ప్రజాపాలన ప్రాధాన్యత, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# మాధవాని కుంట వద్ద గణేశ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- సీసీటీవీలతో నిరంతర నిఘా.. క్రేన్లు, లైటింగ్, బారికేడింగ్ సిద్ధం
- ట్రాఫిక్ డైవర్షన్, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి






**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**
గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాధవాని కుంట వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఐడీఏ బొల్లారం పోలీస్ ఇన్‌స్పెక్టర్ వి. సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో సీఎంసీ అధికారుల సమన్వయంతో నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.నిమజ్జన ప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ కోసం కీలక ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విగ్రహాల నిమజ్జనం కోసం భారీ క్రేన్లు, పరిసర ప్రాంతాల్లో తగిన లైటింగ్, భక్తుల భద్రత కోసం బారికేడింగ్ ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ బందోబస్తు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టారు.బుధవారం ఐడీఏ బొల్లారం ఇన్‌స్పెక్టర్ వి. సుధీర్ కుమార్ పోలీస్ సిబ్బంది, సీఎంసీ అధికారులతో కలిసి మాధవాని కుంటను సందర్శించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లైటింగ్, బారికేడింగ్, క్రేన్లు, సీసీటీవీ కెమెరాలు, పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు**
మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహారెడ్డి సైతం మాధవాని కుంటను సందర్శించి ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ డైవర్షన్, వాహనాల దారి మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటుపై అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వి. సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సీఎంసీ అధికారుల సమన్వయంతో నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.



# కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నా'.. ఐబొమ్మ రవికి ఆర్థిక కష్టాలు !




**హైదరాబాద్ 16 సెప్టెంబర్** ఐ బొమ్మ పైరసీ కేసులో అరెస్ట్ అయిన నిందితుడు ఇమ్మడి రవి నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆయనకు సంబంధించిన అన్ని బ్యాంక్ ఖాతాలను, ప్రాపర్టీ డిపాజిట్లను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే.అయితే, బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ అవ్వడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, తన కుటుంబ పోషణ, నిత్యవసరాలు మరియు వైద్య ఖర్చులకు కూడా తీవ్ర ఇబ్బందిగా మారిందని రవి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.కుటుంబ జీవనం సాగించడానికి, కనీస అవసరాలు తీర్చుకోవడానికి వీలుగా తన ఫ్రీజ్ అయిన బ్యాంక్ ఖాతాలలో కొన్నింటినైనా అన్‌ఫ్రీజ్ చేసేలా పోలీసులను ఆదేశించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు దీనిపై పోలీసుల వివరణ కోరే అవకాశముంది.

# ప్రజా పాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్

**మెదక్ సెప్టెంబర్ 16** జిల్లాలోని గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఈ నెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి గారి అధ్యక్షతన ప్రజా పాలన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని దీనికి సంబంధించి అన్ని ఏర్పాటులు పూర్తి చేసామని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు అధికారులు, అనధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు

# లోధా సామాజిక వర్గం స్థితిగతులపై రాష్ట్ర బీసీ కమిషన్ క్షేత్రస్థాయి విచారణ

**నారాయఖేడ్, సెప్టెంబర్ 16**
తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో లోధ్ / లోదా సామాజిక వర్గం ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, వృత్తి, జీవన పరిస్థితులనుతెలుసుకునేందుకు బుధవారం సిర్గాపూర్ మండలం,కడప్పల్ గ్రామం రైతు వేదికలో, నిజాంపేట్ గ్రామం విచారణ నిజాంపేట్ మండల కేంద్రం లోని రైతు వేదిక లలో క్షేత్రస్థాయి విచారణ నిర్వహించారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి. నిరంజన్. కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, డా. బాలలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక అధికారి సతీష్ కుమార్, లోధా సామాజిక వర్గ ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ... లోధా సామాజిక వర్గానికి చెందిన ప్రజలను వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చాలని కోరుతూ గత కొన్ని సంవత్సరాలుగా కమిషన్‌కు వినతులు అందుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా సామాజిక వర్గాల ప్రజలు రాష్ట్రంలో ఎక్కడెక్కడ నివసిస్తున్నారు, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు, సంప్రదాయాలు, వృత్తులు, విద్యా స్థితిగతులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు చెప్పారు.హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో లోధా సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఉన్నట్లు తమ పరిశీలనలో వెల్లడైందని, కొన్ని ప్రాంతాల్లో వారికి బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ అవుతున్నప్పటికీ సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు రావడం లేదని కోరుతూ వినతులు అందినట్లు తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం, నిజాం




సంస్థానం భారతదేశంలో విలీనమైన తరువాత ఈ సామాజిక వర్గానికి సంబంధించిన వివరాలు, ఆధారాలను సరైన రీతిలో సమర్పించడంలో లోపాలు ఉన్నాయన్న అంశాలను కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.క్షేత్రస్థాయి విచారణలో భాగంగా లోధా సామాజిక వర్గ ప్రజల కుటుంబ పరిస్థితులు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, వృత్తులు, జీవన విధానం, పిల్లల విద్య తదితర అంశాలను నమోదు చేసుకుంటున్నట్లు చైర్మన్ తెలిపారు. విచారణ అనంతరం సమగ్ర సమాచారాన్ని క్రోడీకరించి ప్రభుత్వానికి, సంబంధిత శాఖలకు నివేదిక సమర్పిస్తామని చెప్పారు.పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు అనేక అవకాశాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2021 నుంచి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఈ.డబ్ల్యు.ఎస్ కోటా లో 10 శాతం రిజర్వేషన్ అమల్లో ఉందని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నారాయఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ ... లోధా సామాజిక వర్గ ప్రజలు తమ సమస్యలను, స్థితిగతులను విచారించడానికి బీసీ కమిషన్ రావడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని, లోధా సామాజిక వర్గం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి ప్రభుత్వ పథకాల వివరాలను తెలుసుకుని అర్హత మేరకు లబ్ధి పొందాలని సూచించారు. నారాయణ ఖేడ్ డివిజన్ లో ప్రభుత్వ పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం కొనసాగుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. పేరెంట్స్ కమిటీ సమావేశాలకు హాజరై పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కొత్త పింఛన్లకు అర్హులైన వారు దరఖాస్తులు సమర్పించాలని, ఇందుకోసం సిబ్బంది, ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, డీఎస్పీ, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో, సర్పంచ్‌లు , లోధా సామాజిక వర్గ పెద్దలు, ప్రజలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భరత్‌నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)** భరత్‌నగర్ బస్‌స్టాప్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. బుధవారం ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో వ్యక్తి ఫుట్‌పాత్‌పై పడి ఉండటాన్ని గమనించిన స్థానికుల సమాచారం మేరకు సనత్‌నగర్ పోలీసులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.
అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే సదరు వ్యక్తి మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు.మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా అతని కుటుంబ సభ్యుల ఆచూకీ తెలిసిన వారు సనత్‌నగర్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
వెంకటేశం, ఎస్‌ఐపీ -- 8712581139 - 8712680289

గురువారం, సెప్టెంబర్ 17, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# 22-ఏ నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలి.

**ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలి.**



**మెదక్, సెప్టెంబర్ 16** 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలను వెంటనే జాబితా నుంచి తొలగించి, వాటి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని కోరుతూ మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు మెదక్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అడహాక్ కమిటీ నాయకులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు 22-ఏ నిషేధిత జాబితాలో ప్రభుత్వ భూములను చేర్చడం సమంజసమేనని, అయితే అధికారుల తప్పిదాల కారణంగా ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలు కూడా జాబితాలో చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్లు, ఇతర హక్కు పత్రాలు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు జరగక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.గ్రామాల్లో ఈ సమస్య అధికంగా ఉందని, సంబంధిత రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వ భూములు కాని ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలను 22-ఏ జాబితా నుంచి తొలగించి, ప్రజలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు.
కార్యక్రమంలో అడహాక్ కమిటీ నాయకులు ఉప్పల అశోక్ గుప్త, గుమ్మడి జనార్ధన్, మల్లేశం గౌడ్, వాసర సంజీవ్, వీరేశం చారి, తుంగని సత్యం, ఎస్. రవీందర్ గౌడ్, గోపాల్ రావు, శ్రీకాంత్ రెడ్డి, సాయిలు, ఎండి కరీం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ కోదండ రామలయం ఫ్రెండ్స్ అసోసియేషన్ యూత్ వినాయకుని ప్రత్యేక పూజ లో పాల్గొన్న పీ ఏ సీ యస్ చైర్మన్ కోట వెంకటకృష్ణ మరియు సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు



**మధిర సెప్టెంబర్ 16** దెందుకూరు గ్రామ ప్రజలందరికీ పీ ఏ సీ యస్ చైర్మన్ కోట వెంకటకృష్ణ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయం ప్రత్యేక పూజలో పాల్గొని ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, అభివృద్ధి వెల్లివిరియాలని విఘ్నాలను తొలగించి సకల శుభాలను ప్రసాదించే గణనాథుని కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు,ఆర్థిక పురోగతి, అభివృద్ధి వెల్లివిరియాలని కోరుకున్నారు.ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అయితం ప్రసాద్ మంగమూడి వెంకయ్య కుడారపు ప్రసాద్ ఆలయ చైర్మన్ యడ్లపల్లి సీతారామయ్య యడ్లపల్లి వీరయ్య యడ్లపల్లి వెంకటేశ్వర రావు తదితరులు భక్తులు పాల్గొన్నారు

# కానిస్టేబుల్ ఉచిత శిక్షణతో నిరుద్యోగులకు ప్రయోజనం

**ఉచిత ఫిజికల్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: బంగారు కృష్ణ..**



**సంగారెడ్డి సెప్టెంబర్ 16**
కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు తెలంగాణ మేజర్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత ఫిజికల్ శిక్షణ అందిస్తున్నట్లు తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ అధ్యక్షుడు బంగారు కృష్ణ తెలిపారు.బుధవారం సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్‌లో శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అకాడమీ వ్యవస్థాపకుడు, ఏఆర్ కానిస్టేబుల్ ప్రేమ్ చంద్‌ను సన్మానించారు. రన్నింగ్, హైజంప్, జావెలిన్ త్రో తదితర విభాగాల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో ఫిజికల్ శిక్షణ పొందలేని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బంగారు కృష్ణ సూచించారు. అనుభవజ్ఞుడైన సీనియర్ శిక్షకుడు ప్రేమ్ చంద్ మార్గదర్శకత్వంలో క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో శిక్షణ పొందితే ఉద్యోగ సాధనకు మెరుగైన అవకాశాలు ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ జిల్లా కార్యదర్శి చింతల సాయి కుమార్, భాను ప్రసాద్, అంజన్ కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

# రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే మా లక్ష్యం

**దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర**
**1,500 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసిన కాటూరి వెంకటేశ్వర్లుకు పటాన్‌చెరులో ఘన స్వాగతం**



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**
రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, దేశ ఐక్యత, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు కొనసాగుతున్న జాతీయ పాదయాత్ర బుధవారం పటాన్‌చెరు నియోజకవర్గానికి చేరుకుంది. ప్రకాశం జిల్లాకు చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త కాటూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాదయాత్రకు ముత్తంగి పుట్టి రింగ్ రోడ్ వద్ద నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.అనంతరం ముత్తంగి డివిజన్ పరిధిలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాటూరి









వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించి అభినందించారు. నీలం మధు ముదిరాజ్ పాదయాత్రలో పాల్గొని ముత్తంగి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కాటూరి వెంకటేశ్వర్లు జూన్ 19న కన్యాకుమారి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల మీదుగా ఇప్పటివరకు 1,500 కిలోమీటర్లకు పైగా కాలినడకన ప్రయాణించి పటాన్‌చెరు చేరుకున్నారు. యాత్రలో భాగంగా వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన నాయకత్వం దేశానికి అవసరమని అన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగడం ప్రజాస్వామ్యంలో ముఖ్యమని పేర్కొన్నారు.యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు భరోసా, మహిళలకు సమాన అవకాశాలు, పేదలకు సామాజిక భద్రత, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఐక్యత, సోదరభావం, సామాజిక న్యాయం కోసం ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు వేల కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించడం సాధారణ విషయం కాదని, ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే సంకల్పంతో సుదీర్ఘ పాదయాత్ర చేపట్టిన కాటూరి వెంకటేశ్వర్లును అభినందిస్తున్నట్లు నీలం మధు తెలిపారు. ఎండ, వర్షం, అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ యాత్ర కొనసాగించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటక్ అధ్యక్షుడు కొల్కురి నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, దస్తగిరి, మన్నే రాఘవేంద్ర, సంపత్ రెడ్డి, నారాయణదాసు, మణికంఠ, సందీప్ గౌడ్, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, సుంకరి రవీందర్, జగన్, సీనియర్ నాయకులు ముత్తంగి అశోక్, మధు పంతులు, గడ్డ యాదయ్య, షాపురం నర్సింహారెడ్డి, రుద్రారం లక్ష్మారెడ్డి, దండోరా నర్సింహ, గోపాలకృష్ణ, లక్దారం లక్ష్మారెడ్డి, సంజీవ, సందీప్ యాదవ్, మైలారం శ్రీను, పాండు, శంకర్, ప్రకాష్ రాథోడ్, ప్రవీణ్, రంజిత్, రాజ్ గోపాల్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనంలో తీవ్ర విషాదం

- పెద్దకంజర్ల చెరువులో పడి ఆరుగురు విద్యార్థుల మృతి
- మృతదేహాలకు నివాళులర్పించిన నీలం మధు ముదిరాజ్
- ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారని వెల్లడి











**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**
వినాయక విగ్రహ నిమజ్జనం కోసం వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతి చెందడం అత్యంత విషాదకర ఘటన అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.బుధవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామ పరిధిలోని నేరేడుకుంట చెరువులో గణేశ్ నిమజ్జనం సందర్భంగా ప్రమాదం చోటుచేసుకుంది. శిరీష చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన విద్యార్థులు వినాయక విగ్రహ నిమజ్జనం కోసం చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తూ మునిగిపోయినట్లు సమాచారం. ఈ ఘటనలో శ్యామ్ కుమార్, గణేశ్, నర్సింహరాజు, సుమంత్, ఉదయ్‌కిరణ్, సిద్ధార్థ్ మృతి చెందినట్లు తెలిపారు.విషయం తెలుసుకున్న నీలం మధు ముదిరాజ్ వెంటనే పటాన్‌చెరులోని గ్లోబల్ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసు ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. విద్యార్థుల మృతి తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీసినట్లు తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని పేర్కొన్నారు.పోస్టుమార్టం, మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించడం, తరలింపు తదితర ప్రక్రియలకు సంబంధించి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని నీలం మధు తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారని చెప్పారు.

# గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ఫ్లాగ్ మార్చ్

●గోషామహల్, బేగంబజార్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసుల కవాతు

●శాంతిభద్రతలు, మత సామరస్య పరిరక్షణకు పటిష్ఠ చర్యలు







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)** గణేష్ ఉత్సవాలు--2026, విగ్రహాల నిమజ్జన ఊరేగింపుల నేపథ్యంలో శాంతిభద్రతలు, మత సామరస్యం, ప్రజల భద్రతను కాపాడటంతో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే లక్ష్యంతో గోషామహల్, బేగంబజార్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కవాతులో గోల్కొండ జోన్ అదనపు డీసీపీ కృష్ణ గౌడ్, గోషామహల్ డివిజన్ ఏసీపీ కే. చంద్రశేఖర్ రెడ్డి, గోషామహల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రావణ్ కుమార్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ పి. భరత్ కుమార్ గౌడ్, పోలీస్ సిబ్బంది, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు పాల్గొన్నారు.

**ప్రధాన ప్రాంతాల్లో కవాతు**

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన కవాతు పటేల్ నగర్, దారుస్సలాం, చక్నావాడి, లంబిగల్లి, ఘోడేకీ ఖబర్, ఝూన్సీ చౌరాయి, జుమ్మెరాత్ బజార్ టీ జంక్షన్, ఓవుంట్‌వాడి మసీదు, బేగంబజార్ ఛత్రి, లేబర్ అడ్డా, సెవెన్ హెవెన్ హోటల్ మీదుగా గోషామహల్ పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపుల సమయంలో ప్రజలు ప్రశాంతంగా, పరస్పర సహకారంతో పండుగను నిర్వహించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సున్నితమైన, రద్దీ ప్రాంతాల్లో ఈ కవాతు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

**నిబంధనలు పాటించాలి**

వినాయక మండపాల నిర్వాహకులు, ఊరేగింపుల్లో పాల్గొనే వారు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. కేటాయించిన మార్గాలు, సమయాలను పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సహకరించాలని కోరారు.

**వదంతులను నమ్మొద్దు**

సామాజిక మాధ్యమాల్లో వచ్చే ధృవీకరించని సమాచారం, వదంతులు, రెచ్చగొట్టే సందేశాలను నమ్మవద్దని, వాటిని ఇతరు లకు పంపవద్దని పోలీసులు సూచించారు. అధికారికంగా వెల్లడించే సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపా రు. అనుమానాస్పద కార్యకలాపాలు లేదా శాంతిభద్ర తలకు సంబంధించిన సమస్యలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ గణేష్ ఉత్సవాలు--2026ను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి ఉత్సవాలను శాంతియుతంగా, బాధ్యతా యుతంగనిర్వహించాలని హైదరాబాద్ సిటీ పోలీస్ విజ్ఞప్తి చేసింది.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు

**'మా అమ్మ నాన్న ఫౌండేషన్' ఆధ్వర్యంలో నవ్యశ్రీకి ఘన సన్మానం**



**ముధోల్(లోకేశ్వరం), సెప్టెంబర్ 16** ప్రభుత్వ పాఠశాలలో చదివి, పట్టుదలతో శ్రమించి ఎంబీబీఎస్ సీటు సాధించిన అర్ష నవ్యశ్రీ ని 'మా అమ్మ నాన్న ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. లోకేశ్వరం మండలం బాగాపూర్ గ్రామానికి చెందిన అర్ష ఇందిర – సాయన్న దంపతుల కుమార్తె అయిన నవ్యశ్రీ ప్రభుత్వ బడిలో చదువుకుని వైద్య సీటు సాధించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఆమెను శాలువాతో సత్కరించి అభినందించరు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ యం. ఆంజనేయులు, లవిజయ డైరీ ఫీల్డ్ సూపర్‌వైజర్ దండే రమేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థిని ఎంతో కష్టపడి మెడిసిన్ సీటు సాధించడం గర్వకారణమన్నారు. ఎంబీబీఎస్ పూర్తయిన తర్వాత పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించి ఆదర్శంగా నిలవాలని, కన్నతల్లిదండ్రులను దైవంగా చూసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఇంద్రకరణ్ రెడ్డి, శేఖర్ రెడ్డి, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

# బాసర రేణుకాపూర్ ఆలయ పునర్నిర్మాణానికి దంపతుల భారీ విరాళం



**ముధోల్(బాసర),సెప్టెంబర్ 16** ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవా నిరతిని చాటుకుంటూ నిజామాబాద్‌కు చెందిన చెరుకుల శ్రావణి,నవీన్‌గౌడ్ దంపతులు బాసర రేణుకాపూర్ ఆలయ పునర్నిర్మాణానికి ఉదారంగా భారీ విరాళాన్ని ప్రకటించారు. ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం వారు రూ. 60 వేల నగదు విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు సుకేష్ రావుకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ...ఆలయ నిర్మాణ పనులు విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో భవన నిర్మాణంలో కీలకమైన స్లాబ్ వేసే సమయానికి మరో రూ. 40 వేల ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తామని వారు కమిటీకి హామీ ఇచ్చారు. ఆలయ పునర్నిర్మాణానికి ముందడుగు వేసి ఆర్థిక చేయూతనిచ్చిన శ్రావణి, నవీన్‌గౌడ్ దంపతుల నిబద్ధతను మరియు దాతృత్వాన్ని ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం దాత దంపతులను కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

# సైబరాబాద్‌లో 1,218 మొబైల్ ఫోన్ల రికవరీ

●11వ విడతలో రూ.2.43 కోట్ల విలువైన ఫోన్లను బాధితులకు అందజేత

●ఫోన్లు తిరిగి పొందిన బాధితుల్లో ఆనందం







**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న, దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా పోలీసులు గుర్తించి రికవరీ చేశారు. 11వ విడతలో మొత్తం 1,218 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని సంబంధిత బాధితులకు స్వయంగా అందజేశారు. వీటి విలువ సుమారు రూ. 2,43,60,000గా పోలీసులు తెలిపారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ రికవరీలో సీసీఎస్ కూకట్‌పల్లి పరిధిలో 410, సీసీఎస్ శేరిలింగంపల్లి పరిధిలో 407, సీసీఎస్ కుత్బుల్లాపూర్ పరిధిలో 401 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు.

**సీఈఐఆర్‌తో ఫోన్లను గుర్తింపు**

ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ.. ప్రజలు పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి తిరిగి బాధితులకు అందజేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లను ట్రాక్ చేస్తున్నామని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. నేటి రోజుల్లో మొబైల్ ఫోన్ వ్యక్తిగత అవసరాలతో పాటు ఉపాధి, ఆర్థిక లావాదేవీలకు కూడా కీలక సాధనంగా మారిందని, పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి యజమానులకు అప్పగించడం పోలీసుల బాధ్యతగా భావిస్తున్నామని సీపీ తెలిపారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, బెట్టింగ్ యాప్‌ల ద్వారా జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, మొబైల్ నంబర్లు ఇవ్వకూడదని సూచించారు. మార్కెట్లు, బస్‌సాప్‌లు, ఉత్సవ ప్రాంతాలు వంటి రద్దీ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు, విలువైన వస్తువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అలాగే ఇంటిని విడిచి దూర ప్రాంతాలకు లేదా విహారయాత్రలకు వెళ్లే విషయాలను సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా పంచుకోవద్దని సూచించారు. మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ బృందాలు, పోలీసు అధికారులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

**ఫోన్లు తిరిగి రావడంతో బాధితుల ఆనందం**

తిరిగి మొబైల్ ఫోన్లు పొందిన పలువురు బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కూకట్‌పల్లిలో తన ఐఫోన్‌ను పోగొట్టుకున్న సృజన.. ఫోన్ తిరిగి దొరుకుతుందో లేదోనని ఆందోళన చెందిన సమయంలో పోలీసులు ఫోన్‌ను రికవరీ చేసి అందజేయడంతో సంతోషం వ్యక్తం చేశారు. కోకాపేటలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న టీసీఎస్ ఉద్యోగి నారాయణ చౌదరి.. నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చాలాకాలం గడిచిపోవడంతో ఫోన్ దొరకదని భావించిన సమయంలో పోలీసులు ఫోన్ రికవరీ అయినట్లు సమాచారం ఇవ్వడంతో ఎంతో ఆనందంగా అనిపించిందని చెప్పారు. మెదక్‌కు చెందిన మహమ్మద్ ముఖిబ్ కూకట్‌పల్లిలో పనిచేస్తున్న సమయంలో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నట్లు తెలిపారు. ఫోన్‌లో బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర ముఖ్యమైన సమాచారం ఉండటంతో దుర్వినియోగం అవుతుందేమోనని ఆందోళన చెందినట్లు చెప్పారు. పోలీసులు ఫోన్‌ను రికవరీ చేసి తిరిగి అందజేయడంతో సంతోషం వ్యక్తం చేశారు.

అదేవిధంగా బిహార్‌కు చెందిన ఓ వ్యక్తి సత్వ నాలెడ్జ్ సిటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సమయంలో తన మొబైల్ ఫోన్ చోరీకి గురైందని తెలిపారు. రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం సీసీఎస్ పోలీసులు ఫోన్ రికవరీ చేసి అందజేయడంతో సైబరాబాద్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి, క్రైమ్స్ ఏసీపీలు వై. నాగేశ్వర్ రావు, ఎస్. వెంకటేష్, ఇన్‌స్పెక్టర్లు పి. జగదీశ్వర్ (సీసీఎస్ కూకట్‌పల్లి), జి. సత్యనారాయణ (సీసీఎస్ కుత్బుల్లాపూర్), ఎస్. విజయ్ (సీసీఎస్ శేరిలింగంపల్లి), జి. మురళీకుమార్ (సీసీఎస్ నార్సింగి) తదితరులు పాల్గొన్నారు.

# గోడ్సరా సబ్ సెంటర్‌లో సూపర్‌వైజర్ సుగుణ తనిఖీ



**ముధోల్(కుబీర్),సెప్టెంబర్ 16** మండలం పరిధిలోని గోడ్సరా ఉప ఆరోగ్య కేంద్రాన్ని (సబ్ సెంటర్) సూపర్‌వైజర్ సుగుణ బుధవారం రోజున సందర్శించి, తనిఖీలు చేపట్టారు. కేంద్రంలో రికార్డులను పరిశీలించడంతో పాటు రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లోని రోగుల ఆరోగ్య పరిస్థితులపై వైద్య సిబ్బంది నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. వివిధ రకాల వ్యాధుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,వారికి పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించాలని పేర్కొన్నారు. ప్రజల్లో వ్యాధులను తొలిదశలోనే గుర్తించి, వారికి అవసరమైన అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

# బాసర రైతాంగానికి ఊరట

**మూడు మోటార్లతో నిరంతర సాగునీరు.. చైర్మన్ పోగుల రాజేశ్వర్**



**ముధోల్ (బాసర), సెప్టెంబరు 16** బాసర ప్రాంత రైతాంగానికి సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. గౌరవ శాసనసభ్యులు రామారావు పటేల్ ఆదేశాల మేరకు బాసర లిఫ్ట్ ఇరిగేషన్‌లో సుమారు రూ. 12 లక్షల 60 వేల విలువైన నూతన ప్యానెల్ బోర్డును బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఇరిగేషన్ గౌరవ అధ్యక్షులు అజ్జర్, చైర్మన్ పోగుల రాజేశ్వర్ మరియు కమిటీ సభ్యులు కలిసి ఈ నూతన బోర్డుకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. నూతన ప్యానెల్ బోర్డు అందుబాటులోకి రావడంతో ఇకనుండి మూడు మోటార్ పంపుల ద్వారా నిరంతర ప్రక్రియగా బాసర రైతాంగానికి సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. దీంతో నియోజకవర్గ పరిధిలోని సాగునీటి కష్టాలు తీరనున్నాయని, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోసుల రాజు, ఆనంద్ బండారి, మరియు బీజేపీ నాయకులు బిద్దూర్ రమేష్, సీహెచ్ సాయినాథ్ తో పాటు స్థానిక రైతులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణంలో ఆసుపత్రి..!


పీపుల్స్ న్యూస్

## రహమత్ నగర్ 100 గజాల్లో ఐదు అంతస్తులు.

●పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు.. అధికారుల మౌనం.
●గాల్లో కార్మికుల ప్రాణాలు..!

జూబ్లీహిల్స్ : సెప్టెంబర్ 15 (పీపుల్స్ న్యూస్)
యూసఫ్‌గూడ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ వాటిని అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా రహమత్‌నగర్‌లో కేవలం 100 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండానే ఐదు అంతస్తుల కమర్షియల్ భవనం నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

తెలిసినా ఎందుకు చర్యలు లేవు?
ఒకవైపు అక్రమ నిర్మాణం జరుగుతున్న విషయం టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి తెలిసినప్పటికీ పనులను నిలిపివేయడం, నోటీసులు జారీ చేయడం లేదా నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుంటే అధికారులు ఎందుకు స్పందించడం లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలు పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నిర్మాణం ప్రారంభ దశలోనే గుర్తించి అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. లేకపోతే భవనం పూర్తయిన అనంతరం దానిపై చర్యలు తీసుకోవడం అనేది మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉంది . జరుగుతున్న నిర్మాణానికి సంబంధించిన భవన అనుమతులు, నిర్మాణ ప్లాన్, సెట్‌బ్యాక్‌లు, ఎలాంటివి లేకుండానే నిర్మాణదారుడు నిర్భయంగా నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మౌనం వహిస్తే నిబంధనలను ఉల్లంఘించే వారికి మరింత ధైర్యం వస్తుంది. అందుకే ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి నిర్మాణాలు పునరావృతం కాకుండా కఠినమైన పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు అధికారులకు గుర్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలకు భద్రతేదీ?
అక్రమ నిర్మాణాలు పెరుగుతున్న కొద్దీ భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలకు రక్షణ కరువవుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మూడు, నాలుగు అంతస్తుల ఎత్తులో ఎలాంటి భద్రతా పరికరాలు, సేఫ్టీ బెల్టు, హెల్మెట్లు, రక్షణ వలలు లేకుండానే కార్మికులు ప్రమాదకర పరిస్థితుల్లో పనులు చేస్తున్నారు. భవన నిర్మాణం కోసం తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికుల భద్రతపై సంబంధిత అధికారులు, నిర్మాణ యజమానులు వారి ప్రాణాలను గాలికి వదిలేస్తున్నారు.ఎత్తైన భవనాలపై రక్షణ చర్యలు లేకుండా పనిచేస్తున్న సమయంలో ఒక్కసారి కాలు జారినా.. క్షణాల్లోనే ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి ఘటన జరిగితే కార్మికుడి ప్రాణానికి బాధ్యత ఎవరిది? అధికారులు బాధ్యత తీసుకుంటారా? లేక భవన యజమాని బాధ్యత వహిస్తారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల శ్రీకృష్ణ నగర్‌లో ఇదే తరహాలో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటనను స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు భద్రతా చర్యలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలపై వినిపిస్తున్నాయి.అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడం మాత్రమే కాదు.. వాటిలో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలను కాపాడటం కూడా అధికారుల బాధ్యతే. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదం జరగకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

peoplesnews.online | 16 Sep, 2026 | Page: 8 | Clip ID: C-907913
For more details, visit peoplesnews.online

●జీరో పర్మిషన్‌తో ఐదు అంతస్తులా..?
●15 అడుగుల రోడ్డు 100 గజాల్లో భారీ నిర్మాణం..
●ఐదు అంతస్తులు నిర్మాణమయ్యే వరకు చోద్యం చూస్తారా..?

**జూబ్లీహిల్స్: సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)**
సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన వైద్యుడే అడ్డగోలుగా అక్రమ నిర్మాణం చేస్తున్నారు. సేవా రంగాన్ని వ్యాపారంగా మలుచుకుని టౌన్ ప్లానింగ్ నిబంధనలకు గాలికొదిలి నిటారుగా ఐదు అంతస్తులు అక్రమ నిర్మాణం చేస్తున్నారు.అధికారులకు తెలిసినప్పటికీ వారు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది మొత్తం రహమత్‌నగర్‌లోని పవిత్ర నర్సింగ్ హోమ్ యజమాని 100 గజాలలో చేస్తున్న నిర్వాహకం. ఆసుపత్రికి ఎదురుగా ఓ 100 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండానే 5 అంతస్తుల నిర్మాణం చేస్తున్నారు. మరోవైపు కేవలం 15 అడుగుల రోడ్డులోనే ఐదు అంతస్తుల భవన నిర్మాణం చేయడం వలన భవిష్యత్తులో తీవ్ర ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. బస్తీలలో అంబులెన్స్ వెళ్లేందుకు కూడా దారి ఉండే అవకాశం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు!**
అక్రమ నిర్మాణాలపై అధికారులు తీసుకుంటున్న చర్యలు కేవలం నోటీసులకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణం ప్రారంభమైన సమయంలోనే గుర్తించి అడ్డుకోవాల్సిన అధికారులు.. ఐదు అంతస్తులు నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూసి ఒకట్రెండు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నిర్మాణం మొదటి దశలోనే నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నట్లు గుర్తించి హెచ్చరికలు జారీ చేసి, పనులను నిలిపివేసి ఉంటే ఇంత పెద్ద భవనం నిర్మాణం జరిగేదా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఐదు అంతస్తులు నిర్మాణమయ్యే వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా.. నిర్మాణం దాదాపు పూర్తయ్యాక నోటీసులు ఇవ్వడం వల్ల ప్రయోజనం ఏమిటని నిలదీస్తున్నారు.అక్రమ నిర్మాణాల కారణంగా ఇటీవల శ్రీ కృష్ణా నగర్లో ప్రమాదం జరిగినప్పటికీ అధికారులు ముందస్తుగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజల ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు కొనసాగుతున్న సమయంలోనే కఠిన చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

**నోటీసులకు నోట్ల కట్టలు అడ్డు.**
ప్రభుత్వ ఉద్యోగులుగా వేతనాలు తీసుకుంటున్నప్పటికీ అక్రమ సంపాదన కోసం అధికారులు వెంపర్లాడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల వద్ద అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ వస్తున్న ఆరోపణలపై కూడా అధికారులు మౌనం వీడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అక్రమ నిర్మాణాలకు చర్యలు ఎందుకు తీసుకోరని నిలదీస్తున్నారు.కేవలం నోటీసులు జారీ చేసి ఫైళ్లను మూసివేయడం కాకుండా.. అక్రమ నిర్మాణాలపై వాస్తవంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారో అధికారులు బహిరంగంగా వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణం ప్రారంభమైనప్పుడే అడ్డుకోలేని వ్యవస్థ.. ఐదు అంతస్తులు పూర్తయ్యాక నోటీసులు ఇవ్వడం వెనుక నిర్మాణదారుడుకి ప్రత్యక్షంగా సహకరించినట్టేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు దృష్టి సారించి కొనసాగుతున్న పనులను నిలిపివేయడంతో పాటు అక్రమ నిర్మాణం గుర్తించిన తర్వాత తీసుకోవలసిన చర్యలను ఆలస్యం చేయకుండా కఠినంగా వ్యవహరించడం వలన భవిష్యత్తులోఅక్రమ నిర్మాణాలు తగ్గుతాయని ప్రజలు గుర్తు చేస్తున్నారు.



## మల్యాల గ్రామం లో వరి పంటకు డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారీ




**చందుర్తి సెప్టెంబర్ 16**
రాజన్న సిరిసిల్ల జిల్లా మల్యాల గ్రామంలో వ్యవసాయ కళాశాల, జగిత్యాల, పొలాసకు చెందిన రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్ విద్యార్థులు రైతుల పొలాలను నిరంతరం సందర్శిస్తూ, పంటలకు సంబంధించిన వివిధ సమస్యలను గుర్తించి రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సలహాలు అందిస్తున్నారు.ఇందులో భాగంగా పలుమార్లు రైతు వరి పొలాన్ని సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పంటలో కాండం తొలిచే పురుగు (స్టెమ్ బోరర్) ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. ఈ సమస్య నివారణకు డా. ఆర్. సాయి కుమార్ గారు, టీఆర్‌వీకే వేములవాడ అధిపతి, మరియు మండల వ్యవసాయ అధికారి దుర్గారాజు గారి సూచనలు, సలహాల మేరకు రైతుకు తగిన యాజమాన్య చర్యలను సూచించారు.దీనిలో భాగంగా కాండం తొలిచే పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును ఆధునిక డ్రోన్ సాంకేతికత ద్వారా పిచికారీ చేశారు. డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేయ డం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో సమర్థవంతంగా పిచికారీ చేయడంతో పాటు రైతుల శ్రమ మరియు సమయాన్ని ఆదా చేసుకోవచ్చని తెలిపారు.వ్యవసాయ కళాశాల, జగిత్యాల, పొలాసకు చెందిన విద్యార్థులు ఎం. మధు, ఈ. వాసు, సి. విష్ణు వర్ధన్ మరియు ఎం. సాయి పల్గున్ ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు పంటల సాగు, ఎరువుల యాజమాన్యం, పురుగు మరియు తెగుళ్ల నివారణతో పాటు ఇతర వ్యవసాయ సమ స్యల పరిష్కారానికి నిరంతరం సహకరి స్తున్నారు.

## వినాయక నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల మానేరు తీరంలో నిమజ్జన వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ -16**
వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలోని మానేరు తీరంలోని ప్రేమ్ నగర్, బ్రిడ్జి వద్ద చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె పలు శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి, వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వినాయక నిమజ్జనానికి కావలసిన నీటి సౌకర్యం, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ అధికారులు సేవలు అందించాలని, పారిశుధ్య పనులు చేయించాలని, క్రేన్లు అందుబాటులో పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఇక్కడ మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రాచారి, నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## నైజాం రజాకార్ల అరాచకాల నుంచి విముక్తి లభించిన రోజే సెప్టెంబర్ 17



● అమరవీరుల త్యాగాలకు తగిన గౌరవం దక్కాలి: డాక్టర్ చెన్నమనేని వికాస్

**వేములవాడ సెప్టెంబర్ 16**
సెప్టెంబర్ 17, 1948 తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాస్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాటాడుతూ నైజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాల నుంచి తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించి, భారత యూనియన్‌లో అధికారికంగా విలీనమైన చారిత్రాత్మక ఘట్టం సెప్టెంబర్ 17 అని స్పష్టం చేశారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ దిశా నిర్దేశంలో సాగిన 'ఆపరేషన్ పోలో' సైనిక చర్య ఫలితంగానే తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం లభించిందని, ఈ పోరాటంలో వేలాది మంది అమరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు.గత పాలకులు కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ఈ చారిత్రక ఘట్టాన్ని పక్కనబెట్టారని వికాస్ రావు విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, అమరవీరుల త్యాగాలను పక్కనబెట్టి తుష్టీకరణ రాజకీయాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న ఈ రోజును అధికారికంగా నిర్వహించకపోవడం అమరులను అవమానించడమేనని అభిప్రాయపడ్డారు. ?రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం తరపున అత్యంత వైభవంగా, అధికారికంగా నిర్వహిస్తామని వికాస్ రావు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే తరాలకు తెలంగాణ విమోచన పోరాట నిజమైన చరిత్రను అందించడానికీ, అమరవీరుల త్యాగాలకు తగిన గౌరవం అందించడానికీ బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## మానేరు కరకట్ట పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



● జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
● సిరిసిల్ల మానేరు తీరంలో పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ -16,**
సిరిసిల్ల మానేరు నది వద్ద కరకట్ట పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మానేరు తీరంలో తంగళ్లపల్లి బ్రిడ్జి నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల మేర కరకట్ట పనులు కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, నీటి పారుదల శాఖ, మున్సిపల్ అధికారులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ .. నీటి పారుదల శాఖ అధికా రులు కరకట్ట పనులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని, త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు.

పరిశీలనలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం 1.91 కోట్లు: కొనసాగుతున్న లెక్కింపు



**వేములవాడ, సెప్టెంబర్16**
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి క్షేత్రంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని చేపట్టిన హుండీ లెక్కింపులో భారీ ఆదాయం సమకూరింది. గత 28 రోజులకు సంబంధించి నిర్వహించిన మొదటి రోజు కౌంటింగ్ వివరాలను ఆలయ అధికారులు అధికారికంగా వెల్లడించారు.ఆదాయ వివరాలు:నగదు: ?1,91,64,6 81/- (ఒక కోటీ తొంభై ఒక్క లక్షల అరవై నాలుగు వేల ఆరు వందల ఎనభై ఒక్క రూపాయలు)మిశ్రమ బంగారం: 119 గ్రాముల 500 మిల్లీగ్రాములుమిశ్రమ వెండి: 9 కిలోల 800 గ్రాములుఈ లెక్కింపు ప్రక్రియను ఆలయ ఈవో రమాదేవి కరీంనగర్ దేవాదాయ శాఖ ఏసీ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి ఆలయ డీఈవో నవీన్ కుమార్ పర్యవేక్షించారు. సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పోలీసులు, శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## మండపాల వద్ద అప్రమత్తంగా ఉండాలి

**మంచిర్యాలక్రైం, సెప్టెంబరు 16 :** గణపతి మండపాల వ ద్ద నిర్వహకులు అప్రమత్తంగా ఉండాలని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝూ పేర్కొన్నారు. బుధవారం మంచిర్యాల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పా టు చేసిన పలు గణపతి మండపాలను సీపీ స్వయంగా పరిశీలించారు. వినా యకునికి ప్రత్యేక పూజలు చేశారు. మండపాల నిర్వహకులకు పలు సూచ నలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు, వైరింగ్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద నిర్వహకులు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పోలీసు లు ప్రతి రోజు పెట్రోలింగ్ నిర్వహిస్తూ మండపాలను తనిఖీ చేయాలన్నారు. భద్రత ఏర్పాట్లు, భక్తులకు అందుతున్న సౌకర్యాలు, ఇతర పరిస్థితులను పో లీసులు పరిశీలించాలని సూచించారు. మండపాల నిర్వహకులు పోలీసుల సూ చనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం పట్టణం లోని బొజ్జగణేష్ ప్రమోద్‌రావు, పోలీసులు ఉన్నారు.

## ఆసియా గేమ్స్‌లో టీమ్‌ఇండియాకు

# విప్రజ్ నిగమ్ ఎంపిక



ఒక ఆటగాడి గాయం కారణంగా ఇంకో ఆటగాడికి జట్టులో చోటు దక్కడం ఏ ఆటలోనైనా మామూలుగా జరిగేదే. తాజాగా టీమ్‌ఇండియా జాతీయ జట్టులోనూ అదే జరిగింది. అయితే ఈసారి జట్టులో చోటు దక్కించుకోనున్న ప్లేయర్‌కు మాత్రం ఇది అరంగేట్రం కానుండడం విశేషం. గతేడాది ఐపీఎల్‌లో టోర్నమెంట్‌లో రాణించిన 22ఏళ్ల దిల్లీ క్యాపిటల్స్ బౌలర్‌కు ఆసియా గేమ్స్‌లో ఆడే అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. మరో మూడు రోజుల్లో ఆసియా గేమ్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమ్‌ఇండియాకు రీసెంట్‌గా ఎదురుదెబ్బ తగిలింది. దిల్లీ వేదికగా ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 'సైడ్ స్ట్రెయిన్' (పక్కటెముకల వద్ద కండరాల గాయం)కు గురయ్యాడు. దీంతో అతడు ఈ సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే ఈ సిరీస్‌తోపాటు వరుణ్ ఆసియా గేమ్స్ నుంచి కూడా దూరమయ్యాడు. దీంతో సెలక్టర్లు అతడి రిప్లేస్‌మెంట్‌గా ఐపీఎల్ స్టార్, స్పిన్ ఆల్‌రౌండర్ విప్రజ్ నిగమ్‌ను ఎంపిక చేసినట్లు ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ తమ రిపోర్ట్‌లో పేర్కొంది. "గాయం కారణంగా వరుణ్ కొద్దిరోజులు అందుబాటులో ఉండడు. అతడు గాయం నుంచి కోలుకోవాల్సి ఉంది. దీంతో అతడు ఈ పోటీలకు దూరమయ్యాడు. అయితే అతడి రిప్లేస్‌మెంట్ కోసం సెలక్టర్ల జాబితాలో విప్రాజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్ ఇద్దరి పేర్లు ఉన్నాయి. అయితే లెగ్ స్పిన్నర్ కమ్ ఆల్‌రౌండ్ విప్రజ్ నిగమ్ వైపే సెలక్టర్లు మొగ్గు చూపించారు. రాబోయే ఆసియా గేమ్స్‌లో వరుణ్ స్థానాన్ని విప్రజ్ నిగమ్ భర్తీ చేయనున్నాడు" అని బీసీసీఐ వర్గాలు చెప్పినట్లు పీటీఐ పేర్కొంది. విప్రాజ్ నిగమ్ బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించగలడు. 2025లో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చిన అతడు ఆకట్టుకున్నాడు. ఈ టోర్నీలో తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని కూడా ప్రదర్శించాడు. టీ20ల్లో స్ట్రైక్ రేట్ 176గా ఉండడం విశేషం. విప్రాజ్ బంతితో రాణించడమే కాకుండా, లోయార్డర్‌లో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ఉంది. కాగా, ఆఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో 35 ఏళ్ల వరుణ్ చక్రవర్తి గాయపడ్డాడు. మ్యాచ్ తర్వాత అతను అసౌకర్యంగా ఉన్నట్లు తెలిపాడు. ఆ తర్వాత అతడికి ఎమ్ఆర్ఐ స్కాన్ చేయించగా, పక్కటెముకల్లో గాయం ఉన్నట్లు తేలింది. దీంతో అతడిని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు పంపించారు. అక్కడ కొన్ని రోజులు రిహాబిలిటేషన్ చేయనున్నాడు. ఇటీవలే హ్యామ్‌స్ట్రింగ్ సమస్య నుంచి కోలుకుని జాతీయ జట్టులోకి తిరిగి వచ్చిన వరుణ్ మళ్లీ తొలి మ్యాచ్‌లోనే గాయపడడం అతడికి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. కాగా, కుల్దీప్‌ను కాదని విప్రజ్‌ను ఎంపిక చేయడంపై ఓ కారణం ఉంది. ఈనెలలో ఆఖరి వారంలో భారత్ జట్టు వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ఆడాల్సి ఉంది. ఇందులో కుల్దీప్ బరిలో దిగనున్నాడు. అందుకే విప్రజ్‌ను ఆసియా గేమ్స్‌కు పంపించారు.జపాన్‌లోని ఐచి- నగోయాలో సెప్టెంబర్ 19 నుంచి ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న మొదలవుతాయి. అయితే భారత జట్టు నేరుగా క్వార్టర్-ఫైనల్ దశ నుంచే తన పోరాటాన్ని ప్రారంభిస్తుంది.

## కొచ్చి వేదికగా అక్టోబర్‌లో

# మెగా ఆక్షన్ నిర్వహణ..





### ● డబ్ల్యూపీఎల్ 2027 తేదీలు ఖరారు

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్ నిర్వహణకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం కీలక ప్రకటన విడుదల చేసింది. డబ్ల్యూపీఎల్ 2027 ఎడిషన్ మ్యాచ్‌లను 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ కొత్త సీజన్ కోసం ఆటగాళ్ల మినీ వేలాన్ని ఈ ఏడాది అక్టోబర్ 28న కేరళలోని కొచ్చి నగరంలో జరుపుతారు. అయితే ఈ టోర్నీ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే వేదికల వివరాలను మాత్రం బీసీసీఐ ప్రస్తుతానికి వెల్లడించలేదు. మహిళల క్రికెట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా అవతరించిన డబ్ల్యూపీఎల్, సరికొత్త ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తోందని బోర్డు తన అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇండియా అంతర్జాతీయ స్టార్లతో పాటు వర్ధమాన క్రీడాకారిణులు తమ సత్తా చాటేందుకు ఈ లీగ్ గొప్ప వేదికగా నిలిచింది.రాబోయే సీజన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లను సిద్ధం చేసుకోవడంపై కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న జట్ల నుంచి ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి బీసీసీఐ సెప్టెంబర్ 28ని ఆఖరి గడువుగా నిర్ణయించింది. ఈ గడువు లోగా ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుందని తెలుస్తోంది. రాబోయే సీజన్‌కు సరిపడే అత్యుత్తమ కాంబినేషన్‌లను ఎంపిక చేసుకోవడానికి జట్లకు ఇది మంచి అవకాశం. 2026 ఎడిషన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సంచలన ఆటతీరుతో రెండోసారి డబ్ల్యూపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సారథ్యంలో బరిలోకి దిగిన ఆర్సీబీ, అద్భుత ప్రదర్శనతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆ సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలలో విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు జరగబోయే ఐదో సీజన్‌లోనూ విజేతగా నిలిచి హ్యాట్రిక్ సాధించాలని ఆర్సీబీ బృందం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు తగిన కసరత్తు ముమ్మరం చేస్తోంది ఆ టీమ్ మేనేజ్మెంట్.2023లో ఆరంభమైన డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు చెరో రెండుసార్లు ఛాంపియన్లుగా నిలిచాయి. కొచ్చిలో జరిగే వేలం తర్వాత ఐదు ఫ్రాంచైజీలు కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనున్నాయని తెలుస్తోంది. ఇక మిగతా జట్లు కూడా విజేతగా నిలిచేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి.

# వైభవ్‌తో పోటీ బయటి ప్రపంచానికి మాత్రమే



అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో టీ20 పోరులో 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమ్ ఇండియా ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా, ఆడుతూ పాడుతూ టార్గెట్ చేజ్ చేసింది. ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 88 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. కేవలం 22 బంతుల్లోనే 57 పరుగులు సాధించి సంజూ ఫామ్‌లోకి రావడంతో భారత్ 14.5 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో 15 ఏళ్ల వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీతో పోటీ గురించి వస్తున్న ఊహాగానాలకు సంజూ తనదైన శైలిలో స్పందించాడు. ఫామ్ అనేది తాత్కాలికం, క్లాస్ ఎప్పటికీ శాశ్వతం అని మరోసారి నిరూపించాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఓపెనింగ్ స్థానం కోసం నెలకొన్న తీవ్ర పోటీపై అడిగిన ప్రశ్నకు సంజూ దీటుగా ఆన్సరిచ్చాడు. ఓపెనింగ్ బెర్త్‌ల వివాదంపై సంజూ శాంసన్ స్పందిస్తూ, "బయటి ప్రపంచానికి మాత్రమే వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ నాకు పోటీదారులుగా కనిపిస్తారు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఒకే జట్టుగా దేశం కోసం ఆడుతున్నాం. మాకు జట్టు విజయం మాత్రమే ముఖ్యం, ఆ తర్వాతే వ్యక్తిగత ప్రదర్శనలు వస్తాయి. అతడికి అవకాశం ఇచ్చారు, నాకు ఎందుకు రాలేదు అని బాధపడుతూ నెగెటివ్ ఆలోచనలతో కూర్చోవడం మా జట్టు సంస్కృతిలో లేదు. అలాంటి మనస్తత్వాలు ఇక్కడ పనికిరావు" అని పేర్కొన్నాడు. సోషల్ మీడియాలో మాజీ క్రికెటర్లు చేసే వ్యాఖ్యల గురించి సంజూ శాంసన్ మాట్లాడుతూ, "సాధారణంగా నేను వైఫై ఆఫ్ చేసి నెగెటివిటీకి దూరంగా ఉంటాను. కానీ కొన్నిసార్లు ఆ కామెంట్లు నా కంట పడుతుంటాయి. ఇండియాలో ఆడుతున్నప్పుడు ఇలాంటి కామెంట్లు ఆటగాళ్లపై ప్రభావం చూపుతాయి. మేం రోబోలం కాదు, మాకు భావోద్వేగాలు ఉంటాయి. గతంలో విమర్శలు నన్ను కూడా బాధించాయి. అయితే అనుభవంతో వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను. ఒక షాట్ ఆడే ముందు బయట ఏమనుకుంటారో అని ఆలోచిస్తే నేను ఇలా బ్యాటింగ్ చేయలేను" అని తెలిపాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో సంజూ, అభిషేక్‌లు రాణించినప్పటికీ, బెంచ్‌పై ఉన్న వైభవ్ సూర్యవంశీకి మూడో టీ20లో అవకాశం ఇస్తామంటూ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచన ప్రాయంగా చెప్పాడు. దీంతో ఆఖరి పోరులో ఎవరికి విశ్రాంతి ఇస్తారనేది ఆసక్తిగా మారింది. ఇక ఈ ఈ సిరీస్ ను ఇప్పటికే 2-0తో ఇండియా కైవసం చేసుకోగా, స్వదేశంలో శ్రేయస్ కిదే తొలి సిరీస్ విక్టరీ కావడం విశేషం.

# భారత్‌లోనే జరగనున్న ఐపీఎల్ 2027 వేలం



గత కొన్ని ఏళ్లుగా విదేశాల్లో ఐపీఎల్ వేలాన్ని నిర్వహించే ట్రెండ్‌కు బీసీసీఐ బ్రేక్ వేసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కీలక సమావేశంలో 2027 ఐపీఎల్ మినీ వేలాన్ని మన భారతదేశంలోనే నిర్వహించాలని నిర్ణయించారు! 2023లో కొచ్చిలో జరిగిన వేలం తర్వాత దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో వేలాలు జరిగాయి. అయితే, 2028లో నిర్వహించే మెగా వేలాన్ని మళ్లీ విదేశాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఈసారి మినీ వేలాన్ని మాత్రం స్వదేశంలోనే నిర్వహించనున్నారు. మినీ వేలం కోసం తమ యాజమాన్యం, విశ్లేషకుల బృందాలను విదేశాలకు తీసుకెళ్లడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫ్రాంచైజీలు బీసీసీఐకి విన్నవించాయి. గతేడాది అబుదాబి వేలం సందర్భంగానే టీమ్స్ ఈ అభ్యంతరాలను బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాయి. ఫ్రాంచైజీల అభిప్రాయాలకు గౌరవమిస్తూ, వేలాన్ని భారతదేశంలోని ఏదో ఒక నగరంలో నిర్వహించాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయించింది.అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలం భారతదేశంలో వివాహాల సీజన్ కావడంతో, వేలం వేదిక ఎంపిక కాస్త సవాలుగా మారింది. వేలం నిర్వహణతో పాటు 10 ఫ్రాంచైజీల బృందాలు, బీసీసీఐ అధికారుల వసతి కోసం కనీసం 100కి పైగా 5-స్టార్ హోటల్ గదులు రెండు రోజుల పాటు అవసరం అవుతాయి. హోటల్ గదుల లభ్యతను బట్టి ఏ భారతీయ నగరంలో వేలం నిర్వహించాలనేది త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు ఐపీఎల్‌లో ఎంతో వివాదాస్పదమైన 'ఇంపాక్ట్ ప్లేయర్' నియమంపై బీసీసీఐ ఇంకా ఏటూ తేల్చలేదు. ఈ రూల్‌ను కొనసాగించాలా వద్దా అనే దానిపై ఫ్రాంచైజీలలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. జట్టు నిర్మాణాన్ని ఈ నియమాన్ని బట్టే రూపొందించుకున్నామని, కాబట్టి దీనిపై హడావుడిగా కాకుండా వచ్చే ఏడాది నిర్ణయం తీసుకోవాలని కొన్ని జట్లు కోరుతున్నాయి. దీనిపై స్పష్టత కోసం మరో నెల రోజుల్లో ప్రత్యేకంగా గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం కానుంది.

## స్విమ్మింగ్‌లో మెరిసిన

# మనీశ్ గౌడ్

### - ఓయూ ఇంటర్‌కాలేజ్ స్విమ్మింగ్ పోటీలు



హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్శిటీ ఇంటర్ కాలేజ్ స్విమ్మింగ్ పోటీల్లో కె. మనీశ్ గౌడ్ (సెయింట్ జోసెఫ్ కాలేజ్) సత్తా చాటాడు. మెన్స్ 100 మీటర్ల, 200మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో పసిడి పతకం సాధించాడు. 50మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజత పతకం నెగ్గాడు. బద్రుకా కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు అంబర్‌పేట్ స్విమ్మింగ్‌పూల్‌లో జరుగగా.. ఎన్‌జిఐటి, ఏసీఎంఈ, కేశవ్ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజ్‌లు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాయి. ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొ.సునీల్ కుమార్, ఐయూటీ సెక్రటరీ ప్రొ. దీప్తి, బద్రుకా కాలేజ్ ప్రిన్సిపాల్ మోహన్ కుమార్‌లు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# అనంత్ నాగ్‌కు ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం

### - ఈ నెల 22న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రధానం



ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌ను సినీ రంగంలో అత్యున్నత ప్రతిష్టాత్మక పురస్కారం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. 2024 సంవత్సరానికి ఆయనకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారతీయ సినిమాకు అనంత్ నాగ్ అందించిన సేవలు, విశిష్టమైన సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు కేంద్రం తెలిపింది. గుజరాత్‌లోని కేవడియాలో ఈ నెల 22న జరగనున్న 72వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రధానోత్సవంలో అనంత్ నాగ్‌కు... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారం అందజేయనున్నారు. కన్నడతో పాటు పలు భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు అనంత్ నాగ్. ఆయనకు అత్యున్నత పురస్కారం దక్కడం పట్ల కన్నడ ఇండస్ట్రీతో పాటు సినీ అభిమానులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.నటుడు అనంత్ నాగ్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో సత్కరించబడిన ప్రఖ్యాత నటుడు అనంత్ నాగ్ గారికి అభినందనలు. గత కొన్ని దశాబ్దాలుగా, ఆయన సహజ నటన, అద్భుతమైన బహుముఖ ప్రజ్ఞ, అసాధారణమైన కళా నైపుణ్యం భారతీయ సినిమాపై, ముఖ్యంగా కన్నడ చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేశాయి. ఆయన పోషించిన ప్రతి పాత్రలోనూ సాటిలేని నటనను, జీవాన్ని నింపారు. ఒక గొప్ప కళాకారుడికి ఇది నిజంగా దక్కిన అర్హమైన గౌరవం.' అంటూ పోస్ట్ చేశారు. దాదాపు 5 దశాబ్దాల సినీ ప్రయాణంలో అనంత్ నాగ్... కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠీ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు. తన నటనతో ఎంతో మంది ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు. థియేటర్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన... 1973లో కన్నడ మూవీ 'సంకల్ప'తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత మంథన్, కొండుర, కల్‌యుగ్ తదితర చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి.ఆర్కే నారాయణన్ కథల ఆధారంగా తెరకెక్కించిన ఫేమస్ టీవీ సీరియల్ 'మాల్గుడి డేస్'లో అనంత్ నాగ్ మిఠాయి వాలా పాత్రతో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. అలాగే, రాజ కుమార, గాలిపట 2, కేజీఎఫ్, కన్నేశ్వర రామ వంటి మూవీస్ మరింత పేరు తీసుకొచ్చాయి. తెలుగులో భీష్మ, బాలు, అనుగ్రహం, శంఖారావం వంటి చిత్రాల్లో నటించారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2025లో 'పద్మ భూషణ్'తో గౌరవించింది. ఇప్పుడు అత్యున్నత దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందించనుంది.

# వేగం పెంచిన 'ధర్మన్'




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'ధర్మన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని దర్శకుడు అశ్వత్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. షూటింగ్ సెట్స్ నుంచి ఒక ఆసక్తికరమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియో క్లిప్‌ను ఆయన పంచుకున్నారు. ఈ వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్, నటి రాశి ఖన్నాతో ముచ్చటిస్తూ కనిపించారు. "ధర్మన్ మూడో షెడ్యూల్ కోసం మళ్లీ తలైవర్‌తో కలిశాను" అంటూ ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవలే సెప్టెంబర్ 4న ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్.. రజనీకాంత్ ఒక సీనియర్ మెడికల్ ఫ్యాకల్టీగా జూనియర్ డాక్టర్లకు పాఠాలు చెబుతున్న సన్నివేశాలతో కూడిన వీడియోను విడుదల చేసింది. ఈ లుక్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్నారు. కమల్ నిర్మాణంలో రజనీ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ధర్మమే వెల్లుమ్' (ధర్మమే గెలుస్తుంది) అనే ట్యాగ్‌లైన్‌తో కమల్ హాసన్ స్వయంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక వైద్యుడి పాత్రలో నటిస్తూనే, సమాజంలోని నేరస్థులను శిక్షించే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో విడుదలైన టైటిల్ పోస్టర్‌లో ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ చేతిలో పట్టుకుని, ఒక రౌడీ మృతదేహంపై కాలు వేసి ఉన్న రజనీకాంత్ లుక్ సినిమాపై ఉత్కంఠను మరింత పెంచింది. ఈ చిత్రానికి యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలైన అన్బరివ్ ద్వయం స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వరుస షెడ్యూళ్లతో సినిమాను వేగంగా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ప్రణాళికలు రచిస్తోంది.

# 'ది ప్యారడైజ్'కు సెన్సార్ పూర్తి..



నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్' సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమా మొత్తం 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం గురించి నాని మాట్లాడుతూ, తన 18 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇంతగా శ్రమించిన సినిమా మరొకటి లేదని అన్నారు. "శారీరకంగా, మానసికంగా 'ది ప్యారడైజ్' నన్ను బాగా అలసిపోయేలా చేసింది. ఇంత కష్టపడి నేను మరో సినిమాకు పనిచేయలేదు" అని ఇటీవల మీడియా సమావేశంలో తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. "సినిమాలో నీటి అడుగున సన్నివేశాలు ఉన్నాయని, వెయ్యి మందితో ఫైట్ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. వాటిలో నిజం లేదు. ఇది ఒక వాస్తవిక కథ. యాక్షన్ సన్నివేశాలు చాలా ఉన్నాయి. హింసలో కూడా ఓ భావోద్వేగం ప్రేక్షకులకు కనపడుతుంది" అని వివరించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ, "సినిమా కాస్త ఆలస్యమైనా, విడుదలైన ప్రతి అప్‌డేట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇది ఒక విప్లవాత్మక, భావోద్వేగభరితమైన చిత్రం. తల్లీకొడుకుల కథతో పాటు, అణచివేతకు గురైన ఒక సమాజం కథ ఇది" అని అన్నారు. కాళోజీ మాటలను గుర్తుచేస్తూ, "'పుట్టుక మనది, చావు మనది, కానీ మన బతుకంతా దేశానిది' అనే వాక్యం ఈ కథకు స్ఫూర్తి. దేశం కోసం పోరాడిన ప్రజలకు, అదే దేశంలో చోటు లేనప్పుడు ఏం చేయాలో తెలియక తిరగబడటమే 'ది




# ఓటీటీలోనూ సత్తా చాటుతోన్న విశ్వనాథ్ అండ్ సన్స్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, మమితా బైజు జంటగా నటించిన సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ ఫ్యామిలీ డ్రామా థియేటర్లలో భారీ విజయం సాధించింది. అనంతరం సెప్టెంబర్ 11న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీ థియేటర్ రన్‌లోనే కాదు.. ఓటీటీలోనూ తన సత్తా చాటుతోంది. ఈ క్రమంలో ముఖ్యంగా దళపతి విజయ్, ప్రభాస్ సినిమాల వ్యూస్‌ను అధిగమిస్తూ సూర్య మూవీ సరికొత్త రికార్డు సృష్టించింది. 'విశ్వనాథ్ అండ్ సన్స్' తొలి వారంలోనే రికార్డు స్థాయి వ్యూస్ సొంతం చేసుకుంది. నెట్‌ఫ్లిక్స్ వెల్లడించిన గణాంకాల ప్రకారం..

ఈ సినిమా తొలి వారం (సెప్టెంబర్ 7 నుంచి 13 వరకు)లోనే 5.5 మిలియన్ వ్యూస్ సాధించింది. మొత్తం 14.6 మిలియన్ వ్యూయింగ్ అవర్స్ నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్ నాన్-ఇంగ్లిష్ మూవీస్ ట్రెండింగ్ జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఈ రికార్డు బట్టి చూస్తే ఈ సినిమాకు ఇండియాలోనే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రస్తుతం ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులో ఉంది. 5.5 మిలియన్ వ్యూస్‌తో 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. 2026లో థియేటర్ల తర్వాత ఓటీటీలోకి వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో టాప్ లో నిలిచింది. అంతకుముందు విజయ్ మూవీ బ్లాస్ 4.4 మిలియన్ వ్యూస్‌తో టాప్ ఉండగా.. సూర్య సినిమా ఆ రికార్డును బ్రేక్ చేసింది. కరా 3.8 మిలియన్, జననాయగన్ 3.6 మిలియన్, ప్రభాస్ 'రాజాసాబ్ 3.4 మిలియన్ వ్యూస్‌తో తదుపరి స్థానాల్లో నిలిచాయి. అంటే సూర్య సినిమా థియేటర్లలో సాధించిన విజయాన్ని ఓటీటీ రిలీజ్ తర్వాత కూడా కొనసాగించిందని చెప్పొచ్చు. ఇదే సమయంలో మరో రికార్డు నమోదైంది. నెట్‌ఫ్లిక్స్‌లో థియేట్రికల్ రిలీజ్ తర్వాత స్ట్రీమింగ్‌కు వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఆల్‌టైమ్ ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' 5.5 మిలియన్ వ్యూస్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో అల్లు అర్జున్ పుష్ప 2 5.8 మిలియన్ వ్యూస్‌తో మొదటిస్థానంలో ఉండగా.. ఆ తర్వాత 'విశ్వనాథ్ అండ్ సన్స్' 5.5 మిలియన్‌తో నిలిచింది. ఇడ్లీ కాడాయి 5.2 మిలియన్, లక్కీ భాస్కర్ 5.1 మిలియన్, బాస్ట్ 4.4 మిలియన్ వ్యూస్‌తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# న్యూ ఏజ్ మ్యూజికల్ ఫిల్మ్




హెచ్.టీ సినిమాస్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై హేమల్ తుమ్మపూడి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కనున్న తొలి చిత్రం 'పాటకు ప్రాణం'. ఈ సినిమా బుధవారం ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి దర్శకులు సురేందర్ రెడ్డి, హీరో నిఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంగీతానికి, భావోద్వేగాలకు ప్రాధాన్యతనిస్తూ తెరకెక్కనున్న ఈ చిత్రంలో సుదర్శన్, సాత్విక జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుందని దర్శక, నిర్మాత హేమల్ తుమ్మపూడి తెలిపారు. వైవిధ్యమైన కథాంశంతో, సంగీతానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో, దర్శకుడు హేమల్ తుమ్మపూడి మాట్లాడుతూ , "ముందుగా మా లాంటి యువ ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇక్కడికి విచ్చేసిన మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన హీరో నిఖిల్ గారికి, దర్శకుడు సురేందర్ రెడ్డి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. మా చిత్రబృందాన్ని ఆశీర్వదించేందుకు వచ్చిన నటీనటులందరికీ ధన్యవాదాలు.సుమారు 60 ఏళ్లుగా వెనుకబడిపోయిన రామయ్య అనే వ్యక్తి, అలాగే 20 ఏళ్ల యువకుడు కలిసి ప్రారంభించే మ్యూజికల్ జర్నీ చుట్టూ మా సినిమా కథ సాగుతుంది. ఇది న్యూ ఏజ్ మ్యూజికల్ డ్రామా. సినిమాలో చాలా పాటలు ఉంటాయి. మా చిత్రానికి శేఖర్ చంద్ర అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.ఈ సినిమాను వచ్చే ఏడాది ద్వితీయార్థంలో మంచి తేదీని చూసుకుని థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం అని తెలిపారు.తనికెళ్ల భరణి గారు మాట్లాడుతూ ,'ఈ సినిమాను 'శంకరాభరణం'తో పోల్చడం లేదు. అయితే ఆ సినిమాలో ఉన్న సంగీత స్ఫూర్తి ఈ సినిమాలో కూడా కనిపిస్తుంది. ఈ చిత్రంలో ఒక పాత తరం సంప్రదాయ సంగీత విద్వాంసుడికి, ఈ తరం జెన్-జెడ్ సంగీతకారుడికి మధ్య ఉండే ఆసక్తికరమైన కలయికను చూపించబోతున్నారు' అని అన్నారు.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com